RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 135 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం,నవంబర్,18,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 135 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday,November,18,2025 | PAGES : 8 RS : 4 /- |




## సౌదీ అరేబియాలో ఘోర ప్రమాదం

**42 మంది భారత యాత్రికుల సజీవ దహనం.. ఎక్కువ మంది హైదరాబాదీలే!**

- సౌదీ అరేబియాలో భారత యాత్రికుల బస్సుకు ప్రమాదం
- డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో 42 మంది సజీవ దహనం

ఢిల్లీ.: సౌదీ అరేబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 42 మంది భారత యాత్రికులు ప్రాణాలు కోల్పో యారు. యాత్రికులతో ప్రయాణిస్తున్న బస్సును డీజిల్ ట్యాంకర్ ఢీకొట్టడం తో మంటలు చెలరేగి వారంతా సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో మరణించిన వారిలో ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి చెందినవారే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. వివరాల్లోకి వెళితే, పవిత్ర మక్కా యాత్రను ముగించుకుని యాత్రికులు బస్సులో మదీనా నగరానికి బయలుదేరారు. ఈ క్రమంలో వారి బస్సును ఎదురుగా వస్తున్న డీజిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి బస్సు మొత్తం వ్యాపించాయి.

## సౌదీ ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**



హైదరాబాద్,తెలంగాణ దిశ : సౌదీ అరేబియాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 42 మంది భారత యాత్రికులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఉమ్రా యాత్ర ముగించుకుని మక్కా నుంచి మదీనాకు వెళుతున్న బస్సు, బదర్-మదీనా మధ్యలోని ముఫరహత్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున 1:30 గంటలకు డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సుకు మంటలు అంటుకోవడంతో అందులో ఉన్న యాత్రికులు సజీవ దహనమయ్యారని ఇంగ్లిష్ మీడియా కథనాలు వెల్లడించాయి. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ దుర్ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



## లాలూ కుటుంబంలో ముసలం..

- ఇల్లు విడిచి వెళ్లిన మరో ముగ్గురు కుమార్తెలు
- లాలూ యాదవ్ కుటుంబంలో ముదిరిన సంక్షోభం
- తేజస్వి అనుచరులు దూషించారంటూ రోహిణి ఆరోపణలు
- చెల్లెలి అవమానంపై అన్న తేజ్ ప్రతాప్ తీవ్ర ఆగ్రహం
- బీహార్ ఎన్నికల ఓటమితో ఆర్జేడీలో అంతర్గత కుమ్ములాటలు

ఢిల్లీ,: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంలో మొదలైన సంక్షోభం మరింత ముదురుతోంది. ఆయన కుమార్తె రోహిణి ఆచార్య కుటుంబంతో తెగదెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే, మరో ముగ్గురు కుమార్తెలు పాట్నాలోని ఇంటిని విడిచివెళ్లడం రాజకీయంగా కలకలం రేపుతోంది. రాగిణి, చందా, రాజలక్ష్మి తమ పిల్లలతో కలిసి ఢిల్లీకి పయనమయ్యారు.



## సౌదీ ఘటనపై జై శంకర్ దిగ్భ్రాంతి


న్యూఢిల్లీ,నవంబర్17 : సౌదీ అరేబియాలోని మదీనాలో భారతీయ పౌరులకు జరిగిన ప్రమాదంపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ట్వీట్ పెట్టారు జై శంకర్. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ ఈ ప్రమాదంలో ప్రభావితమైన భారతీయ పౌరులు, కుటుంబాలకు పూర్తి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని జై శంకర్ ప్రార్థించారు.



## ప్రమాద మృతుల కుటుంబాలకు 5లక్షల ఎక్స్‌గ్రేషియా

- అజారుద్దీన్ నేతృత్వంలో సౌదీకి ప్రభుత్వ బృందం
- అక్కడే అంత్యక్రియలకు ఏర్పాట్లు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

హైదరాబాద్,తెలంగాణ దిశ : సౌదీ అరేబియా బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ. 5లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. బాధితులకు అండగా నిలవాలని ఈ భేటీలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఎంఐఎం ఎమ్మెల్యేతోపాటు మైనార్టీ విభాగానికి చెందిన ఉన్నతాధికారితో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలనీ కేబినెట్ నిర్ణయించింది. బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలకు మత సంప్రదా యం ప్రకారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబసభ్యులకు చెందిన ఒక్కో కుటుంబంనుంచి ఇద్దరిని సౌదీ తీసుకెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన..



## ఆ ఆపరేషన్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమే

**పాక్‌కు మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన ఆర్మీ చీఫ్**

ఢిల్లీ: దాయాది పాకిస్థాన్ కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ ఏడాది మేలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల ట్రైలర్ మాత్రమేనని అన్నారు. దాయాది ఏదైనా దుశ్చర్యలకు పాల్పడితే గట్టి గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఉపేంద్ర ద్వివేది ఈ సందర్భంగా మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్ 88 గంటల్లో ముగిసిన ట్రైలర్ మాత్రమే. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులకైనా మేం సిద్ధంగా ఉన్నాం.



## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ-శిక్ష

- మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని నిర్ధారణ
- ప్రస్తుతం ఢిల్లీలో ఆశ్రయం పొందుతున్న హసీనా
- హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరిన బంగ్లాదేశ్ ప్రభుత్వం
- ఆచితూచి స్పందించిన భారత విదేశాంగ శాఖ

ఢిల్లీ,: బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ, ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ-బీడీ) మరణశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ సోమవారం ఈ సంచలన తీర్పును వెలువరించింది. హసీనా తో పాటు మాజీ హెూంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్, మాజీ పోలీస్ చీఫ్ చౌదరి అబ్దుల్లా అల్-మామున్‌కు కూడా ఇదే శిక్ష ఖరారు చేసింది.





## పత్తి కొనుగోళ్లపై ప్రతిష్టంభన

- ఎనుమాముల మార్కెట్‌లో నిలిచిన కొనుగోళ్లు
- కేంద్ర,రాష్ట్రాలది మొద్దు నిద్ర అంటూ కెటిఆర్ విమర్శలు

వరంగల్,తెలంగాణ దిశ : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కె ట్‌లో పత్తి కొనుగోళ్లపై తీవ్ర గందరగోళం నెలకొంది. కాటన్ కార్పొరే షన్‌ఆఫ్ ఇండియా సీసీఐ తీరుపై రైతులు, జిన్నింగ్ మిల్లర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కొత్త కొర్రీలతో ఇబ్బం దులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు తెలిపారు. ఈ క్రమంలో నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్‌కు వ్యాపారులు పిలుపునిచ్చారు. బంద్ పిలుపు నేపథ్యంలో రైతులు పత్తినిమార్కెట్‌కు తీసుకురాని పరిస్థితి.దీంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ బోసిపోయింది. పత్తి కొనుగోళ్లపై ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల్లో ఆందోళన నెలకొంది. తీసిన పత్తిని అమ్ముకోలేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.పత్తి రైతులబాధలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు స్పందిస్తూ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



## మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

- జూబ్లీహిల్స్ ఫలితమే నిదర్శనం
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- మిర్యాలగూడలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

మిర్యాలగూడ,తెలంగాణ దిశ : మరో 15 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన శంకు స్థాపన చేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడారు. జూబ్లీహి ల్స్ ఉప ఎన్నికలో ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యా లగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా మని చెప్పారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో మిర్యాల గూడ ప్రజలు కాంగ్రెస్‌కి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రూ. 180.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు మంత్రులు.

# కన్నుల పండువగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ

### - స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో మారు మోగిన సుర్వి బాబయ్య ఫంక్షన్ హాల్



**నాగారం, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** :కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా నాగారం సుర్వి బాబయ్య ఫంక్షన్ హాల్ లో సోమవారం అయ్యప్ప స్వామి 18వ మహా పడి పూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి మాదిరెడ్డి మహిపాల్ రెడ్డి 18వ శబరి యాత్ర సందర్భంగా శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి మహా పడి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ ప్రాంగణం స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో మారుమోగింది. బ్రహ్మశ్రీ గురు స్వామి శివ కార్తీక్ శాస్త్రి వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక అలంకరణతో అయ్యప్ప



స్వామికి మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపులి ఈశ్వర్ భజన బృందం భక్తి గీతాలతో భక్తులను ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం హారతి కార్యక్రమం, సహస్రనామార్చన, అభిషేకం నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ శాసన సభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి,బిజ్జా శ్రీనివాస్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ సత్యం సాగర్, కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్ తదితరులు హాజరై అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి కుటుంబాల్లో శాంతి, సంపదలు చేకూరాలని ఆకాంక్షించారు.

## గంజాయి లేని సమాజం నిర్మిద్దాం




**కుత్బుల్లాపూర్, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేకచోట్ల విచ్చలవిడిగా జరుగుతున్న గంజాయి క్రయ విక్రయాలను తక్షణమే అరికట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బాచుపల్లి మండల పార్టీ కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ సోమవారం బాచుపల్లి సీఐ సి.సతీష్ ను కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి సేవిస్తున్న కొందరు యువకులు అనేక ప్రాంతాలలో చిన్న చిన్న విషయాలకే తీవ్ర కోపోద్రిక్తులై కత్తులతో దాడులు చేస్తూ సమాజంలో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వివరించారు. ప్రధానంగా బాచుపల్లి పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ గృహకల్ప, డబల్ బెడ్రూమ్స్ తదితర ప్రాంతాలలో గంజాయి క్రయ, విక్రయాలు పెరిగిపోయాయని అన్నారు. దీని కారణంగా సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆయన అన్నారు. గంజాయి క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రాంతాలలో పోలీసు గస్తీని పెంచాలని ఆయన కోరారు. సిఐ సతీష్ మాట్లాడుతూ గంజాయిని అరికట్టడంలో సమాజంలోని అందరూ ఉమ్మడిగా కృషి చేద్దామని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి యాదయ్య, పొన్నగంటి దస్తగిరి పాల్గొన్నారు.

# చర్లపల్లి డివిజన్ ద్వారకాపురి కాలనీలో జోరుగా అక్రమ నిర్మాణాలు

### - టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి నిలువెత్తు సాక్ష్యం.?



**చర్లపల్లి, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** : కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతులకు విరుద్ధంగా, అసలు అనుమతులే లేకుండా అనేక నిర్మాణాలు జరుగుతున్న అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మామూళ్లకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. అక్రమ కట్టడాలపై ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒకవైపు అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుంటుంటే కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వం వల్ల చర్లపల్లి డివిజన్ ద్వారకాపురి కాలనీలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుతున్నాయి. చోట మోటా నాయకుల పేర్లు చెబుతూ అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా అధికారులు మాత్రం అందిన కాడికి దండుకొని అక్రమ నిర్మాణదారులపై చర్యలు




తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇక్కడ అధికారులు, సిబ్బంది తీరును చూస్తే ఔరా అనిపిస్తోంది. ద్వారకాపూరి కాలనీలో అనుమతులను ధిక్కరించి యదేచ్చగా నేను నిర్మిస్తాను ఎవరు అడ్డుకుంటారో అడ్డుకోండి.. అనే రీతిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ద్వారకాపురి కాలనీలో అక్రమ నిర్మాణాలను చూస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు వంత పాడుతున్నట్లుగా ఉందంటూ స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. దీనిపై సంబంధిత సర్కిల్ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ద్వారకపురి కాలనీ అక్రమ నిర్మాణం టౌన్ ప్లానింగ్ అధికారికి మాత్రం కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. అసలు డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ల దృష్టికి ఈ విషయం వెళ్లిందో లేదో తెలియదు కానీ ఇకనైనా అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు బాహాటంగానే దుమ్మెత్తి పోస్తున్నారు.

# తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడవ విడత అన్న ప్రసాద వితరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రతి సోమవారం – రైతు అన్న ప్రసాద వితరణ మూడవ విడత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకొని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కోసంవందల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారని అన్నారు. అందులో కొంత మందికైనా తమ సంస్థ నుండి అన్న ప్రసాద వితరణ అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం కూడా జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం ఐదు రూపాయల భోజన కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. త్వరలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. అనంతరం సంస్థ ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు వారాల నుండి తమ శక్తి మేరకు సుమారు వందమంది వరకు అన్న ప్రసాద వితరణ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం తనకు ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.



మరి కొంత మంది దాతలు ముందుకు వచ్చి తమకు సహకారం అందిస్తే ఎక్కువ మందికి అన్న ప్రసాద వితరణ అందించేందుకు అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దాతలు మీ సహకారాన్ని ఫోన్ పే, గూగుల్ పే సెల్ నెంబర్ 90320 88236 ద్వారా అందించ వచ్చునన్నారు. మూడవ విడత అన్నదాన కార్యక్రమానికి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఫారుక్, సామాజిక కార్యకర్త రచనరెడ్డి సహకరించారని అన్నారు. వారికి సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అరుణ్ కుమార్, అంబాల మల్లేష్, ఎండి. రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ అండర్-8 విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన పోస్తూ బ్లేస్సి



**హైదరాబాద్, నవంబర్ 17, (తెలంగాణ దిశ)**:ఇండియన్ బిగెస్ట్ సూపర్ స్టార్స్ బ్యాటర్స్ 2025 ఆల్ ఇండియా ఓపెన్ స్కేటింగ్ టోర్నమెంట్స్ ను యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ ట్యాంక్ బండ్‌పై నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో స్వీట్ స్కేటింగ్ అకాడమీ సైనిక్ పురి విద్యార్థులు అత్యధిక పతకాలు సాధించినట్లు కోచ్ కన్నా గౌడ్ తెలిపారు. ఈ టోర్నమెంట్ లో వివిధ రకాల స్కేటింగ్ ఫ్రో ఇన్ లైన్ క్యాడ్ స్కేటింగ్ రెగ్యులర్ ఇన్ లైన్స్ స్కేటింగ్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో అత్యధికంగా 800 పైగా విద్యార్థులు పాల్గొన్నారు. సెయింట్ మేరీ బెతాని కాన్వెంట్ విద్యాలయ హైస్కూల్ రెండవ తరగతి



విద్యార్థినీ పోస్తూ బ్లేస్సి అండర్-8 విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. దీంతో పోస్తూ బ్లేస్సిని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# శక్తి స్వరూపిణి ప్రత్యంగిరా దేవి దయ, సనాతన ధర్మం ఆధారంగా చల్లగా జీవిస్తున్నాం!

### - మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**కుత్బుల్లాపూర్, నవంబర్ 17, (తెలంగాణా దిశ)** :హిందువుల ప్రముఖ దేవత, వైదిక మతంలో విశేషంగా పూజింపబడే ప్రత్యంగిరా దేవి చల్లని చూపు, సనాతన ధర్మం సంస్కృతి సంప్రదాయాలతో సుఖంగా జీవించగలుగుతున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ప్రగతినగర్ పట్టాభి రామాలయంలో అర్చక స్వాముల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ ప్రత్యంగిరా దేవి విశేష పూజలలో భాగంగా సోమవారం జరిగిన హెూమం, మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, ఆలయ కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు వారిని అభినందించారు. అంతకు ముందు ప్రత్యంగిరా దేవి వైభవ ప్రవచనంలో బాచంపల్లి సంతోష్ కుమార్ శర్మ సనాతన హైందవ ధర్మం గురించి, హిందువులు చేయవలసిన పనులు, పాటించవలసిన



ఆచార వ్యవహారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకస్వాములతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్ రెడ్డి, కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు విజయలక్ష్మీ సుబ్బారావు, ఇంద్రజిత్ రెడ్డి, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, దాసి నాగరాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, చెన్నారెడ్డి, ఆశోక్ మైలారం, రచ్చ చక్రధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సాకేత్ రోడ్డు నాలా కబ్జా నిర్మాణం నిలిపివేత

### - కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ ఆదేశం

**కాప్రా, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** : సాకేత్ రోడ్డులోని గణేష్ మందిరం ఎదురుగా నాలా కబ్జా చేసి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ సోమవారం నిర్మాణ ప్రాంతాన్ని తనిఖీ చేసారు. ప్రాథమిక విచారణలో సదరు నిర్మాణంలో పూర్తి స్థాయిలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. నాలాపై అక్రమంగా జరుగుతున్న ఈ నిర్మాణం వల్ల భవిష్యత్తులో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని బైరెడ్డి రాజేష్ ఆదేశించారు. ఈ అంశంపై నివేదిక సమర్పించడం కోసం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, నీటిపారుదల శాఖలకు లేఖలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. నాలా భూమిని కబ్జా చేసి అక్రమ



నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మహేందర్, ఆర్ ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# బసవ పున్నయ్యపై చర్యలు తీసుకోవాలి

### - సిపీఎం నేతలకు బండి విజయ్ కుమార్ ఫిర్యాదు

**మహబూబ్ నగర్, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** :ఫెడరేషన్ లో నియంతృత్వ పోవడం అవలంభిస్తున్న టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అడహాక్ కమిటీ కో కన్వీనర్ డాక్టర్ బండి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు ఫెడరేషన్ నాయకులు సిపిఎం నేతలకు ఫిర్యాదు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో సిపిఎం పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పొలిట్ బ్యూరో నాయకుడు తమ్మినేని వీరభద్రం, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు కిల్లె గోపాల్, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి ఏ. రాములుకు ఇటీవల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీలో జరిగిన పరిణామాలను వివరించారు.

బసవ పున్నయ్య వల్ల అనేక విచ్చిన్న పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. స్వంత నియంతృత్వ పోకడలు, పెడదోరణలు, చెలామని పెరిగిపోయిందని వివరించారు. బసవ పున్నయ్య వ్యవహార శైలిని



అనేకసార్లు మార్చుకోవాలని కోరినప్పటికీ ఎలాంటి మార్పు లేదన్నారు. నన్నెవరూ ఏమి చేయలేరు నేనే బాస్ అనే పోకడ పెరిగిందని, తన స్వార్థంతో ఫెడరేషన్ లో అనేక అక్రమాలు జరిగాయని గుర్తు చేసి వివరించారు. పార్టీ రాష్ట్ర స్థాయిలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడతూ.. ఇలాంటి పరిణామాలను కచ్చితంగా పార్టీలో చర్చించి తగిన విదంగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సిపిఎం నాయకులను కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, జిల్లా కమిటీ నాయకులు విష్ణుతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో బహిరంగ వేలం

**ఏఎస్ రావునగర్, నవంబర్ 17, (తెలంగాణ దిశ)** :ఏఎస్ రావునగర్ డివిజన్ టిఎస్ఐఐసీ కాలనీ, కమలానగర్ లోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో టెంకాయలు పూజా సామాగ్రి, కిరాణా సరుకులు సప్లయ్ చేయుటకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ సిహెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం వేస్తామని తెలిపారు. టెంకాయలు, కొబ్బరి చిప్పలు సేకరించి అమ్ముకొనుట, కిరాణా సరుకులు సప్లయ్ చేయుటకు, స్వామివారి శేష వస్త్రములు అమ్మవారి చీరలు సేకరించి అమ్ముకొనుటకు బహిరంగ వేలం వేయడం జరుగుతుందన్నారు. ఇందులో టెంకాయలు, పూజా సామాగ్రి కోసం రూ. 20 వేలు, కొబ్బరి చిప్పల సేకరించి అమ్ముకొనుటకు రూ. ఐదు వేలు డిపాజిట్ చెల్లించవలసి ఉంటుందన్నారు.



# సంపాదకీయం

## దివాళా దిశగా పాకిస్తాన్

ప్రస్తుతం పాకిస్తాన్లో ఆర్థిక, రాజకీయ గందరగోళం ఏర్పడింది. దాని కారణంగా ఈ దేశం దివాళా అంచున ఉంది. పాకిస్థాన్ పరిస్థితి గురించి ప్రపంచం మొత్తానికి బాగా తెలుసు. అదే సమయంలో ఐఎంఎఫ్ షరతులకు తలొగ్గేందుకు పాకిస్థాన్ కూడా సిద్ధంగా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న కాలంలో ఈ దేశ పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం కనిపిస్తోంది. పాక్ పరిస్థితి కారణంగా ప్రపంచంలోని రెండు దేశాలు చాలా ఆందోళన చెందుతున్నాయి. ఈ రెండు దేశాలు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ రెండు దేశాలు పాకిస్తాన్‌లో చాలా పెట్టుబడులు పెట్టాయి కాబట్టి ఈ రెండు దేశాల ఆందోళన చెందుతున్నాయి. చైనా, జపాన్‌లు అమెరికా ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు పెట్టే స్థితిలో ఉన్నట్లే, పాకిస్థాన్ పరిస్థితి కారణంగా ఈ రెండు దేశాలు కూడా భారీ నష్టాలను చవిచూడవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో అనేక రకాల పరిస్థితులు సృష్టించబడుతున్నాయి. ఇందులో పాకిస్తాన్ పుంజుకునే పరిస్థితి ఎక్కడా కనిపించదు. విదేశీ రుణాలను తిరిగి చెల్లించడానికి పాకిస్తాన్ వద్ద ఎటువంటి నిధులు లేవు. పొరుగు దేశం వద్ద కేవలం 4 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరోవైపు చైనా, యూఏఈ, సౌదీ అరేబియా పాకిస్థాన్‌కు సాయం చేస్తాయని ఊహాగానాలు కూడా వచ్చాయి. ఈ దేశాలన్నీ కలిసి వచ్చిన తర్వాత కూడా పెద్దగా నిధులు సేకరించలేకపోయాయికొద్ది వారాలు పాకిస్తాన్‌లో వరదలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. లక్షలాది మంది వరదల బారినపడ్డారు. జనజీవనం అస్తవ్యస్తమైంది. ఆహార పదార్థాల ధరలు కూడా బాగా పెరిగాయి. రెండు వారాల్లోనే పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో 20 కిలోల గోధుమ పిండి బస్తా ధర 2,500 రూపాయలకి చేరింది. బియ్యం ధరల్లో కూడా భారీగా పెరుగుదల కనిపించింది. 25 కిలోల బియ్యం సంచి ఇప్పుడు 9 వేల నుంచి 9,500 రూపాయలకు అమ్ముడవుతోంది, ఇంతకుముందు రూ. 8 వేలు ఉండేదని కమిషన్ ఏజెంట్లు చెబుతున్నారు. 25 కిలోల బియ్యం బస్తా ధర గతంలో కంటే 1,000 రూపాయలకు పైగా పెరిగింది. ఒక్కో కేజీకి 40 రూపాయల వరకూ పెరిగింది. వరదల తర్వాత, మార్కెట్‌కు గోధుమల సరఫరా తగ్గిందని, గోడౌన్లలో నిల్వ చేసిన ధాన్యం కూడా పాడైపోయిందని పిండి మిల్లుల యజమానులు చెబుతున్నారు. ధరలు పెరగడానికి ఇదే కారణమని వారంటున్నారు. అయితే, ఆహార పదార్థాల కొరత కంటే నిల్వలు దాచిపెట్టుకోవడం, లాభార్జన కోసం చూడడం వల్లే ధరలు పెరుగుతున్నాయని నిపుణులంటున్నారు. వరదల వల్ల కొరత ఏర్పడిందా? లేదంటే నిల్వలు దాచుకుంటున్నారా? ఈ సమస్యను అర్థం చేసుకోవడానికి, పిండి మిల్లుల యజమానులు, ధాన్యం మార్కెట్‌కు చెందిన వ్యాపారులు, నిపుణులతో బీబీసీ మాట్లాడింది. పాకిస్తాన్‌లో గోధుమలు, పిండి ధరలు సాధారణంగా ఏటా సెప్టెంబర్ తర్వాత పెరుగుతాయి. ఈ సమయంలో, కొత్త పంట వచ్చినప్పుడు, ప్రజలు తమ అవసరాల కోసం గోధుమలు కొంటారు. అవి అయిపోతే మార్కెట్‌లో పిండి కొనడం ప్రారంభిస్తారు. పిండి మిల్లులు కూడా మార్కెట్ నుంచి గోధుమలను కొని పిండిగా మార్చి అమ్ముతాయి. దీనివల్ల డిమాండ్ పెరిగినప్పుడు.. పిండి, గోధుమల ధరలు కూడా పెరుగుతాయి. దీనిని 'సీజనల్ సైకిల్' అంటారు. దీనిని నియంత్రించడానికి ప్రభుత్వం తన గిడ్డంగులలోని గోధుమలను మార్కెట్లో విక్రయిస్తుంది. స్టాక్ తక్కువగా ఉంటే దిగుమతులు చేసుకుంటారు. దీంతో ధరలు మామూలుగా ఉంటాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ సంవత్సరం పాకిస్తాన్‌లో మొత్తం గోధుమ ఉత్పత్తి 29.6 మిలియన్ టన్నులు. 32 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే, ప్రభుత్వం వద్ద అదనపు గోధుమ నిల్వలున్నాయి. ఐఎంఎఫ్ ఒత్తిడి, ప్రభుత్వ గిడ్డంగులలో అదనపు గోధుమలు ఉండటం వల్ల, ప్రభుత్వం రైతుల నుంచి గోధుమలు కొనలేదు. దీంతో, మార్కెట్లో ధరలు తగ్గడం మొదలైంది. గత ఏడాది మాండ్(సుమారుగా 40 కిలోలు) గోధుమల ధర 3,900 రూపాయలుంటే.. ఇప్పుడు 1,800 నుంచి 2,000 రూపాయలకు తగ్గింది. అందుకే రైతులు నిరసనలు ప్రారంభించారు."గోధుమ ధరలు తక్కువగా ఉన్నప్పుడు, సాధారణంగా గోధుమలను కొనని అనేక రంగాలవారు కూడా వాటిని కొనడం మొదలుపెట్టారు. ఉదాహరణకు పౌల్ట్రీ ఫీడ్, పశుగ్రాస ఫ్యాక్టరీల వంటివారు. ఎందుకంటే, దాణాలో ఉపయోగించే మొక్కజొన్న వంటి ఇతర పదార్థాల కంటే గోధుమలు చౌకగా ఉంటాయి" అని కమోడిటీ నిపుణులు షంసుల్ ఇస్లాం చెప్పారు. ఈ సంవత్సరం పంట కోతల తర్వాత గోధుమ ధర తగ్గడం వల్ల, పిండి కూడా చౌకగా మారిందని ఆయన తెలిపారు."పాకిస్తాన్, భారత్ యుద్ధ సమయంలో బియ్యం, గోధుమల నిల్వల్లో అకస్మాత్తుగా పెరుగుదల కనిపించింది. అప్పుడు పిండి మిల్లులు కూడా గోధుమలను నిల్వ చేశాయి. ఇతరులు కూడా రంగంలోకి దిగారు" అని షంసుల్ ఇస్లాం తెలిపారు. ఆగస్ట్ మధ్య నుంచి భారీ వర్షాల కారణంగా పంజాబ్‌లోని చాలా ప్రాంతాల్లో వరద పరిస్థితి కొనసాగుతోంది. ఆగస్ట్ చివరిలో కేంద్ర ఆహార భద్రతా మంత్రి రాణా తన్వీర్ అహ్మద్ అధ్యక్షతన గోధుమ బోర్డు సమావేశం జరిగింది. దేశంలో తగినంత గోధుమ నిల్వలు ఉన్నందున, ప్రభుత్వం గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదని నిర్ణయించారు. గోధుమలను దిగుమతి చేసుకోబోమని ప్రభుత్వం చేసిన ప్రకటన తర్వాత తమ ఇష్టానుసారం మార్కెట్లో ధరలను పెంచొచ్చు, తగ్గించొచ్చు అని నిల్వదారులు గ్రహించారు" అని షంసుల్ ఇస్లాం అన్నారు. ఒక మాండ్ గోధుమలను 2,200 రూపాయలకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు 4,000 రూపాయల చొప్పున అమ్ముతున్నారని, అందుకే వినియోగదారులకు పిండి రేటు పెరిగిందని ఆయన తెలిపారు. మార్కెట్లో గోధుమల ధరలు పెరగడం వల్లే పిండి ధర పెరుగుతోందని ఫ్లోర్ మిల్ అసోసియేషన్ వాదిస్తోందని షంసుల్ ఇస్లాం అంటున్నారు. 20 కిలోల బ్యాగ్ ధర 1,500 రూపాయలు నుంచి 2,500 రూపాయలకు పెరిగిందని ఆయన అన్నారు. ఇటీవల, పంజాబ్ ప్రభుత్వం గోధుమ నిల్వలపై చర్య తీసుకుని, పశుగ్రాస మిల్లుల గోడౌన్ల నుంచి లక్ష టన్నులకు పైగా గోధుమలను స్వాధీనం చేసుకుంది. ఈ గోధుమలను ఒక్కో మాండ్‌కు 3,000 రూపాయల చొప్పున, 20 కిలోల పిండి బస్తాను 1, 810 రూపాయల చొప్పున విక్రయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంజాబ్‌లో ధరలను స్థిరీకరించడానికి, ప్రభుత్వం ప్రతి నెలా కనీసం 5 లక్షలటన్నుల గోధుమలను మార్కెట్లోకి విడుదల చేయాల్సి ఉంటుందని పిండి మిల్లుల సంఘం అంటోంది. పాకిస్తాన్‌లో పిండి ధరలు అకస్మాత్తుగా పెరిగిన తర్వాత, ఖైబర్ పఖ్తుంఖ్వాలో 20 కిలోల పిండి బ్యాగ్ 900 నుంచి 1,000 రూపాయలకు అమ్ముడవుతోంది. ఇప్పుడు అదే 20 కిలోల బ్యాగ్ 2,400 రూపాయల నుంచి 2,500 రూపాయలకు అమ్ముడవుతోంది. పిండి ధర పెరగడంతో, బ్రెడ్ ధర కూడా పెరిగింది. ఖైబర్ పఖ్తుంఖ్వా గోధుమల కోసం పంజాబ్‌పై ఆధారపడి ఉందని ఖైబర్ పఖ్తుంఖ్వా ఆహార మంత్రి జహీర్ షాహ్ టోరో బీబీసీ ప్రతినిధి అజీజుల్లాహ్ ఖాన్‌తో చెప్పారు.

# ఫుట్ పాత్ షాపుల తొలగింపు

**కుత్బుల్లాపూర్,నవంబర్ 17, (తెలంగాణా దిశ):** ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ఫుట్ పాత్ ఆక్రమణలను సోమవారం మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. నిజాంపేట్ విలేజ్ కమాన్ నుండి నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ వరకు ఫుట్ పాత్ లు, రోడ్లను ఆక్రమించి నిర్వహిస్తున్న షాపులను ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేందుకు మార్గంసుగమం చేశారు. ఈ సందర్భంగా రోడ్డుపై వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐదు ఆటోలను,11తోపుడు బండ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని నిర్వహిస్తున్న వ్యాపారస్తులపై కేసుల నమోదు కోసం బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. బాచుపల్లి–జెఎన్ టియూ ప్రధాన రోడ్ లో ట్రాఫిక్ విపరీతంగా పెరుగు తున్నందువల్ల ఫుట్ పాత్ వ్యాపారాలను, ప్రధాన రోడ్లపై తోపుడు బండ్లతో చేసే వ్యాపారాలను పూర్తిగా తొలగిస్తామని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. తద్వారా వాహనదారులకు,



పాదాచారులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపరిచేందుకు కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు స్థల పరిశీలన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 17, (తెలంగాణ దిశ) :**
డిసెంబర్ లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కోసం సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క స్థల పరిశీలన చేసారు. జిల్లాలోని దుండిగల్ మండలంలో ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 453, 454 లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, కలెక్టర్‌మను చౌదరి, ఈసీ నర్సింహా రెడ్డిలతో కలిసి స్వయంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్ విజన్ 2047 అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడి దారులను కూడా ఆహ్వానం పలుకుతుందని తెలిపారు. హైదరాబాద్ అనుకూలమైన వాతావరణం,
అత్యంత నైపుణ్యంతో కూ డిన మానవ వనరులు కలిగి ఉన్నందున



పెట్టుబడిదారులను మరింతగా ఆకర్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, టి. శ్యామ్ ప్రకాష్, ఆర్ డిఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని మోసగించిన ఎమ్మెల్యే మాజీ పిఏ అరెస్ట్

**కుత్బుల్లాపూర్, నవంబర్ 17, (తెలంగాణ దిశ) :**
డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ అమాయకులను మోసగించి తప్పించుకు తిరుగుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అనుచరుడు బోడిమిశెట్టి హరిబాబును సోమవారం జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం... కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పీఏ గా చెప్పుకుంటూ ఉద్యోగం చేసిన బోడిమిశెట్టి హరిబాబు ఎమ్మెల్యే వద్దకు వచ్చే పలువురి వద్ద నుండి లక్ష రూపాయల చొప్పున డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడు. గతంలో కొంత మంది బాధితులు ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసిన పోలీసులు, ప్రస్తుతం మరి కొంతమంది బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో మరోసారి హరిబాబును సోమవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇప్పటి వరకు ఎనిమిది మంది బాధితుల యొక్క స్టేట్ మెంట్ రికార్డు చేయడం జరిగిందని, ఆ స్టేట్ మెంట్ ఆధారంగా వారిచ్చిన ఆధారాలను ధ్రువీకరించుకొని నిందితుడిని అదుపులో తీసుకుని రిమాండ్ తరలించారు. నిందితుడి సెల్ ఫోన్ లో ఉన్న ఆధారాల ద్వారా ఇంకా వివరాలను సేకరించి తదుపరి విచారణ జరుగుతుందని బాలనగర్ సహాయ కమిషనర్ నరేష్ తెలిపారు. ఈ మాదిరిగా నిందితుడు సుమారు 80 మందిని మోసగించినట్లు ప్రచారం జరుగుతుందని, మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే జీడిమెట్ల పోలీసుల సహాయం కోరవచ్చునని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రోన్లతో ఆటకట్టిస్తున్నారు...

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఏపీ పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. కేసులను ఛేదించడంలో టెక్నాలజీని వాడుకుంటు న్నారు. ముఖ్యంగా డ్రోన్ల సహకారంతో నేరస్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సహా పలు నేరాలను అరికట్టడానికి పోలీసులు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లతో నేరాలు సైతం తగ్గుముఖం పడుతుండడం విశేషం. తాజాగా చిత్తూరు జిల్లాలో పోలీసులు డ్రోన్ల సాయంతో అంతర్ జిల్లా జూద ముఠా ఆట కట్టించారు. పొదల్లో పేకాట ఆడుతున్న వారిని డ్రోన్ల సాయంతో పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నగదు, సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా ముసలి పేడు పొలాల్లో గుంపుగా కొంతమంది పేకాట ఆడుతున్నారు. దీనిపై సమాచారం రావడంతో పదిమంది పోలీసులు డ్రోన్ల సాయంతో వెతుకులాట ప్రారంభించారు.
ఓ పొలం సమీపంలోని పొదల్లో ఎవరికీ కనిపించకుండా వారు పేకాట ఆడుతు న్నారు. ఆ లోపలికి వెళ్లిన డ్రోన్.. అక్కడ పదుల సంఖ్యలో మనుషులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించింది. పోలీసులకు సమాచారం రావడంతో ఆ పొదల్లోకి వెళ్లి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. తిరుపతికి చెందిన ఇద్దరు, కడప జిల్లాకు చెందిన ఐదుగురు, రాజంపేటకు చెందిన ఇద్దరు, మరో ఇద్దరు స్థానికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,36,740 నగదు తో పాటు 12 సెల్ ఫోన్లు, నాలుగు బైక్ లను స్వాధీనం చేసుకున్నారు. మరో 9 మంది పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల చేతికి డ్రోన్ వచ్చింది. డ్రోన్ టెక్నాలజీని వాడుకొని నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పోలీసులు అరికడుతున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నిఘా పెంచారు. దొంగతనాలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. డ్రోన్ల సాయంతో పోలీసులు నేరాలను నియంత్రిస్తున్నారు. ఊరికి దూరంగా ఉండే ఖాళీ స్థలాలు, శిధిల భవనాల్లో గంజాయి తాగుతున్న వారిని పట్టుకుంటున్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిని, అసాంఘిక శక్తులు గుమిగూడే ప్రాంతాలను సైతం గుర్తించి వేగంగా అక్కడకు చేరుకుంటున్నారు. వారిని అదుపులోకి తీసుకోగలుగుతున్నారు. విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో విపరీతంగా గంజాయి సాగు అవుతోంది. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడుతున్న దాని మూలాలు విశాఖను చూపిస్తున్నాయి. దీంతో డ్రోన్ల సాయంతో గంజాయి సాగుపై దృష్టి పెట్టారు పోలీసులు. మన్య ప్రాంతంలో గంజాయి సాగుతున్న ప్రాంతాలను గుర్తించి దహనం చేస్తున్నారు.
.అప్పటినుంచి పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించారు. జిల్లాల్లో ప్రధాన పోలీస్ స్టేషన్లకు ఇప్పటికే డ్రోన్లు అందించారు. మిగతా పోలీస్ స్టేషన్లకు సైతం అందించనున్నారు. జాతరలతో పాటు పండగ సమయాల్లో కూడా డ్రోన్లు ఎగురవేసి నిరంతర నిఘ పెడుతున్నారు. కోడిపందాలు, జూద మాటలు లేకుండా నియంత్రిస్తున్నారు.

# అంతర్గాం మండలంలో ఊరురా అభివృద్ధి పనులు

**రామగుండం,తెలంగాణ దిశ :**ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయం9 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం. రామగుండం నియోజకవర్గం: అంతర్గాం మండలంలోని అంతర్గాం గోలివాడ, మూర్మోర్ తదితర గ్రామాలలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ సంబంధించిన సుమారు 9 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ, అంగన్ వాడి బిల్డింగ్స్, గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని నిరుపేదలకు ఇప్పటి వరకు 464 తెల్ల రేషన్ కార్డులు ఇవ్వగా మరో 18 మందికి తెల్ల రేషన్ కార్డులను అందించారు. అలాగే నలుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారుమండల కేంద్రంలో 10 లక్షల వ్యయంతో అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే రాష్ట్ర పాడి పారిశ్రామాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో 30 లక్షలతో మూర్మోర్ గ్రామంలో మినీ పాలసీతలీకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆర్భాటంగా ప్రారంభించారు. మండలంలో 35 లక్షల వ్యయంతో బల్కం మిల్క్ కూలింగ్ యూనిట్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఊరు రా పనుల జాతర కార్యక్రమానికి ఈరోజు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే క్రమంలో అంతర్గాం మండలంలోని పలు గ్రామాలలోని ప్రజలకు కనీస అవసరాలు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, విద్యుత్ తదితర అభివృద్ధి పనులకను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో వివిధ విభాగాలలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అవసరమైన నిధులను మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాటిని దశలవారీగా లబ్ధిదారులకు నిధులను మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాలలో పాడి, పంటలు, కనీస సౌకర్యాలను మెరుగుపరిచేందుకే సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ప్రజా పాలన నేపథ్యంలో ప్రతి గ్రామంలోని గడప గడపకు అభివృద్ధి ఫలాలను అందించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అండదండగా ఉంటుందన్నారు. గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇదే క్రమంలో రైతు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అర్హులైన వారికి అందించేందుకే కృషి చేస్తున్నామని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీజీడీడీసీఫ్ మరియు అంతర్గాం మండల తాసిల్దార్ తుమ్ రవీందర్ పంచాయతీరాజ్ అధికారులు సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు

# జై జవాన్ కాలనీ నూతన కమిటీకి ఘనంగా సన్మానం



డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జైజవాన్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులకు సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్‌శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అసోసియేషన్ ఎన్నికలలో తిరుమలయ్య ప్యానల్ పై ఉపేందర్ రెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించడం, కొన్ని సంవత్సరాలుగా ఏకచక్రాధిపత్యం,అహంకారం, అవినీతి ఓడిపోయి న్యాయం గెలిచిందన్నారు. ఈ శుభ సందర్భంలో జై జవాన్‌కాలనీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ లను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

– (ఏఎస్ రావునగర్, తెలంగాణ దిశ)

# బెంగళూరులో ఆపిల్ భారీ ప్రాజెక్ట్..!

బెంగళూరు: ఆపిల్, ప్రపంచంలోని అతిపెద్ద టెక్ దిగ్గజాల్లో ఒకటి, భారతదేశంలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించింది. తాజాగా భారత మార్కెట్‌ను మరింత సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేసింది. భారీగా పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమవుతోంది. బెంగళూరులో 2.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కార్యాలయ స్థలాన్ని పదేళ్ల లీజు ఒప్పందంతో సొంతం చేసుకుం ది. ఈఒప్పందం విలువ విలేవే రూ. 1,000 కోట్లకు పైగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యాలయం తొమ్మిది అంతస్తుల్లో విస్తరించి ఉండి, పార్కింగ్, ఇతర సౌకర్యాలను కలిగి ఉంది. నెలకు రూ. 6 కోట్ల రెంట్‌తో, ఇది భారతదేశంలో అతిపెద్ద కార్యాలయ లీజు ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది. ఈ లీజు ఒప్పందం ఆపిల్ భారత్‌పై దీర్ఘకాలిక నిబద్ధతను సూచిస్తుంది. 2.7 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం రూ1,000 కోట్ల విలువైన పదేళ్ల ఒప్పందం అనేది ఒక సాధారణ రియల్ ఎస్టేట్ ఒప్పందం కాదు. నెలవారీ రూ. 6 కోట్ల రెంట్, సంవత్సరానికి నిర్దిష్ట శాతం పెరుగుదలతో, ఈ ఒప్పందం ఆర్థిక దృష్ట్యా భారీగా ఉందని చెప్పవచ్చు. ఈ కొత్త కార్యాలయం ఆపిల్ యొక్క ఇంజనీరింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ), సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాలకు స్థలం కల్పిస్తుంది. బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పిలవబడే నగరం, దాని నైపుణ్యం కలిగిన టెక్ ప్రొఫెషనల్స్, ఆవిష్కరణలకు కేంద్రంగా ఉండటం వల్ల ఆపిల్ ఈ నగరాన్ని ఎంచుకుంది. ఈ కార్యాలయం ఆపిల్ ఉత్పత్తుల అభివృద్ధి, ముఖ్యంగా ఐఫోన్, ఇతర టెక్ సొల్యూషన్స్‌కు సంబంధించిన పరిశోధనలను మరింత వేగవంతం చేస్తుంది. ఇది స్థానిక ఉద్యోగులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది, దీనివల్ల బెంగళూరు, భారతదేశంలోని టెక్ రంగం మరింత బలోపేతమవుతుంది. ఆపిల్ ఇప్పటికే భారతదేశం నుంచి ఐఫోన్‌ల ఎగుమతిలో అగ్రగామిగా ఉంది. ఈ కొత్త కార్యాలయం ద్వారా,ఆపిల్ తన ఉత్పాదన, ఎగుమతి సామర్థ్యాన్ని మరింత పెంచాలని లక్ష్యంగాపెట్టుకుంది. భారతదేశంలోని తయారీ కేంద్రాల నుంచి ఐఫోన్‌లను ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేయడం ద్వారా, ఆపిల్ భారత ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన సహకారం అందిస్తోంది. ఈ కార్యాలయం ద్వారా స్థానిక ఉత్పాదన, ఆవిష్కరణలు, ఎగుమతు లు మరింత ఊపందుకుంటాయని పరిశ్రమ నిపుణులు మాత్రమే కాక, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఒక వరంగా ఉంటుంది. కొత్త కార్యాలయం వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది, ముఖ్యంగా టెక్, ఇంజనీరింగ్, ఆర్అండ్‌డీ రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు.

# జిల్లాల పర్యటనకు జనసేనాని



విశాఖపట్టణం: జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం పెడుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సమావేశానికి హాజరవుతారు. అయితే విశాఖపట్నం నుంచి ఇక కార్యకర్తల్లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ సిద్ధమయిన ట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలతో పాటు కూటమిపైన తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో భాగంగానే ఆయన వరసగా కార్యకర్తల సమావేశాలు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన తర్వాత సరైన పదవులు రాకపోవడంతో పాటు, కూటమిలోని ఇతర పార్టీల నేతల నుంచి సహకారం అందడం లేదని కార్యకర్తలు కొంత అసంతృ ప్తితో ఉన్నారు.. ఈ సమయంలో క్యాడర్ లో జోష్ నింపేందుకు పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటనలు పెట్టుకున్నట్లు తెలిసింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగనున్నాయి. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈసారి ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్ కార్యకర్తలను ముందుగా ప్రిపేర్ చేయడానికి ఈ కార్యక్రమం భుజానకెత్తుకున్నట్లు తెలిసింది. ప్రతి జిల్లాలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారికి సరైన భరోసా ఇవ్వడంతో పాటు భవిష్యత్ లో తన ప్రణాళిక ఏంటన్నది కూడా పవన్ వివరించే అవకాశముందని తెలుస్తుంది. దీనివల్ల పార్టీకి, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ తొలిగిపోతుందని ఆయన భావిస్తున్నారు. ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ ఎందుకు సర్దుకుపోతున్నానని... నిజానికి వచ్చే నెల నుంచి పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన చేయాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేయడానికి జిల్లాల పర్యటనను సెప్టంబరు నుంచి చేస్తానని ఇటీవల మీడియాకు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెలాఖరులోనే ఆయన విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశానికి హాజరు కానున్నారు.

# విద్యార్థులపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్నిరుద్దే యత్నం : కేరళ




తిరువనంతపురం : యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) విడుదల చేసిన అభ్యాస ఫలితాల ఆధారిత పాఠ్య ప్రణాళిక ముసాయిదా (ఎల్‌ఒసిఎఫ్)పై కేరళ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని "విద్యార్థులపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని రుద్దడానికి ఉద్దేశించిన చర్య"గా పేర్కొంది. ఎల్‌ఒసిఎఫ్‌పై అభ్యంతరాలను కేంద్రానికి సమర్పించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రతిస్పందనను రూపొందించే బాధ్యతను విజయన్ ప్రభుత్వం కేరళ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (కెఎస్‌హెచ్ఇసి)కి అప్పగించింది. ముసాయిదా నమూనా పాఠ్యాంశాలను సమీక్షించడానికి మరియు సమగ్ర మూల్యాంకనం కోసం మంగళవారం ఒక కమిటీని నియమించనుందని విధాన ఆలోచనా మండలి కార్యనిర్వాహక కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్ రాజన్ గురుకుల్ తెలిపారు. ముసాయిదాల ప్రాథమిక సమీక్షలో అవి తిరోగమనం, అశాస్త్రీయం మరియు ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయని తేలిందని కేరళ ఉన్నత విద్యామంత్రి ఆర్.బిందు తెలిపారు. యుజిసి ప్రతిపాదించిన బహుళ విభాగ మరియు సమగ్ర విద్య లక్ష్యాలకు ఈ పాఠ్యాంశాలు విరుద్ధంగా ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ముసాయిదా పాఠ్యాంశాలు విద్యాపరమైన ఆలోచనలను తిరస్కరిస్తున్నాయని, భాషా అధ్యయనాల ప్రాముఖ్యతను విస్మరిస్తున్నాయని అన్నారు. కార్పోరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) మరియు పర్యావరణ, సామాజిక మరియు పాలన (ఇఎస్‌జి) ప్రణాళికలో 'రామరాజ్యం'ను చేర్చడంపై మండిపడ్డారు. వాణిజ్య పాఠ్యాంశాల్లో ఉపనిషత్తులు, మహాభారతం మరియు కౌటిల్యుడి అర్థశాస్త్రంలను ప్రవేశపెట్టడం, స్వాతంత్ర్య ఉద్యమం గురించిన అభ్యాస జాబితాలో దీనదయాళ్ ఉపాధ్యాయ, సావర్కర్‌ల జీవిత చరిత్రలను చేర్చడాన్ని కూడా విమర్శించారు. ఈ మార్పులు కాషాయీ కరణను తీవ్రతరం చేయడానికి, అశాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడానికి ఉద్దేశించబడినవని అన్నారు. ఇవి విద్యా స్వేచ్ఛను, ఉన్నత విద్య నాణ్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటువంటి అజెండా మన విద్యాసంస్థల్లో అసహనం మరియు అశాంతికి దారితీస్తుందని సూచించారు. ఆంత్రోపాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, ఎకనామిక్స్, జియాలజీ, హోమ్‌సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ మరియు పొలిటికల్ సైన్స్‌లకు సంబంధించిన ముసాయిదా పాఠ్యాంశాలను యుజిసి ఇటీవల ప్రచురించింది. వాటిపై ప్రజల అభిప్రాయాన్ని ఆహ్వానించింది. తొమ్మిది సబ్జెక్టులకు విడుదల చేసిన ఎల్‌ఒసిఎఫ్‌పై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి.

# హెచ్చరికలతో సరా?

విజయవాడ: మధ్యకాలంలో టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు చాలా ఎక్కువగా వాడుతున్న పదం నేను "95 నాటి చంద్రబాబుని.. ఎవరి అలసత్వాన్ని ఉపేక్షించను "అని. కానీ జరుగుతున్న పరిణామా లు చూస్తుంటే అప్పటి స్ట్రిక్ట్ చంద్రబాబు మళ్లీ కనబడడం కష్టమేనా అని అనుమానాలు వస్తున్నాయి. వరుస పెట్టి పార్టీ నాయకులు వివాదాల్లో చిక్కుకుంటున్నా కొంతమంది హద్దు దాటి ప్రవర్తిస్తున్నా చంద్రబాబు హెచ్చరికలు వరకు మాత్రమే పరిమితం అయిపోతున్నా రా అన్న చర్చ పార్టీ వర్గాల్లో సైతం మొదలైంది. ఈ ఒక్క నెలలోనే టిడిపి నాయకులు నాలుగు పెద్ద వివాదాల్లో చిక్కుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ సినిమా రిలీజ్ అవుతుంటే ఆ సినిమాను ఆడనివ్వం అంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్ ప్రసాద్ హెచ్చరిస్తున్నట్టుగా ఉన్న ఆడియో రిలీజ్ అయింది. అందులో వాడిన దుర్భాషలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్ని తీవ్రంగా బాధపెట్టాయి. దానితో వాళ్ళు నిరసనలకి దిగారు. ఆడియో తనది కాదనిఎమ్మెల్యే ఎంత చెప్పినా చాలామంది అదిఆయనదే అని నమ్ము తున్నారు. చంద్రబాబు సైతం ఎమ్మెల్యేని పిలిపించి మందలిం చా రుకానీ ఇప్పటికీ ఆ వివాదం చల్లబడలేదు. నెల్లూరు అరుణ విషయం పార్టీ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది. ఆమె సన్నిహితుడు యావజ్జీవ ఖైదీ శ్రీకాంత్‌కి పెరోల్ లభించేలా ఇద్దరు టిడిపి ఎమ్మెల్యేలు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అది అటు ఇటు తిరిగి ఏకంగా హోంశాఖకు అంటుకుంది. ప్రస్తుతం శ్రీకాంత్ తిరిగి జైలుకు వెళ్లిపోగఅరుణ కూడా అరెస్టు అయింది. దీనిపై హోంమంత్రి స్వయంగా మీడియాకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తమను వేధిస్తున్నాడు అంటూ ఒక మహిళ మీడియా ముందుకు వచ్చారు. అసభ్యకరమైన వేధింపులు ఎదుర్కొన్నామని ఆరోపణలు చేశారు. దీని ఎమ్మెల్యే స్పందిస్తూ తనపై జరిగిన కుట్రగా ఖండించా రు. ఇవన్నీ కూడా ఇండైరెక్టుగానో లేక ఆడియోలపరం గానో నేతలు వివాదాల్లో చిక్కుకున్నవి. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్ని పరిధిలూ దాటేశారు. విధుల్లో ఉన్న అటవీ సిబ్బందిపై తన అనుచరులతోపాటు దాడి చేసినట్టున్న విజువల్స్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిలో అటవీశాఖ డైరెక్ట్‌గా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతిలో ఉంది. దీనితో ఆయన సీరియస్ అయ్యారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా ఎవరిని వదిలిపెట్టొద్దంటూ పోలీసులను ఆదేశించడంతో ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. ఈ నాలుగు వివాదాలు ఒక్క నెలలోనే బయటపడడం అనేది ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఉన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలలో కొంతమంది ఎంత లెక్క చేయకుండా ప్రవర్తిస్తున్నారో అన్న నిజాన్ని బయటపెట్టింది. ఇలాంటి వివాదాలు వరుస పెట్టి బయటపడుతున్నా "చంద్రబాబు మండిపడ్డారు "నేతల్ని హెచ్చరించారు 'ఇలాంటి హెడ్డింగ్స్‌కి వార్తలు పరిమితం అవుతున్నాయి తప్ప ఆయన తనదైన శైలిలో యాక్షన్ తీసుకున్న సూచనలు కనిపించడం లేదు. 2024లో గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలో అసభ్యకరమైన వీడియోలో కనిపించినందుకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు చంద్రబాబు. అలాంటి ఫైర్‌నే తెలుగు ప్రజలు చంద్రబాబు నుంచి ఎదురుచూసేది. నిజంగానే 1995-99 మధ్య చంద్రబాబు అంటే స్ట్రిక్ట్ పొలిటీషియన్, క్రమశిక్షణ కలిగిన అడ్మినిస్ట్రేటర్‌గా దేశవ్యాప్తంగా పేరు ఉండేది. ఆయన కూడా అది గమనించి "తాను 95మోడల్ చంద్రబాబు "గానే పని చేస్తానని పదేపదే చెబుతున్నారు. కానీ గ్రౌండ్ రియాల్టీ అలా కనిపించడం లేదన్న వాదన ఉంది. ఆయన మనసులో ఏముందో తెలియదు గానీ పార్టీ క్రమశిక్షణపరంగా సామాన్య తెలుగు ప్రజలు ఎదురుచూస్తున్న చంద్రబాబు పనితీరు ఇదైతే మాత్రం కాదు అనే విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

# ఎప్పుడూ సోషల్ మీడియాలోనే ఉంటారా ? ఉద్యోగం రెడీ..!



ముంబయి : ఎప్పుడు చూసినా సోషల్ మీడియాలో బిజీగా ఉండే వారిని చూస్తూనే ఉంటాం.. ఎక్కువ సమయం ఫోన్‌తోనే గడిపేవారు చాలా ఎక్కువమంది ఉంటారు..! ఇలాంటివారే కావాలని, ఉద్యోగం ఇస్తామని ఓ కంపెనీ సీఈఓ ఇచ్చిన జాబ్ ఆఫర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముంబయిలోని మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు విరాజ్‌సేథ్ ఈ జాబ్ ఆఫర్ చేశారు.

అర్హతలేం కావాలంటే : " మాంక్-ఇలో పనిచేసేందుకు డూమ్ స్క్రోలర్స్ కావాలి. స్క్రీన్ స్క్రోల్ చేస్తూ తాజా విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేవారు కనీసం ఆరు గంటలు ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ ను స్క్రోల్ చేయాలి.

కంటెంట్ క్రియేటర్ కల్చర్‌లో నిమగ్నమై ఉండాలి. కంటెంట్ క్రియేటర్ల గురించి తెలిసి ఉండాలి "అని చేయాల్సిన పని గురించి విరాజ్ లింక్డిన్, ఇన్‌స్టాగ్రాం స్టోరీస్‌లో వివరంగా పోస్టు పెట్టారు. అలాగే హిందీ, ఇంగ్లీష్‌లో నైపుణ్యం ఉండాలని, ఎక్సెల్ వాడకం తెలిసి ఉండాలని రాసుకొచ్చారు. ఇది ఫుల్‌టైం ఉద్యోగం అని చెప్పారు. జీతం వివరా లను మాత్రం వెల్లడించలేదు.

భిన్నాభిప్రాయాలు : ఈ ఉద్యోగ ప్రకటనపై సోషల్ మీడియా వేదికగా భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "నేను 19 గంటలు ఆన్‌లైన్‌లోఉంటాను. అయితే నేను ఓవర్ క్వాలిఫైడా..? " అని ఫన్నీగా ఒకరు కామెంట్ పెట్టారు."కాలం మారింది. సోషల్ మీడియా అధికంగా వాడటం గతంలో ప్రమాదకరం అనేవారు. ఇప్పుడు ఫుల్ టైమ్ జాబ్ లభిస్తోంది " అని ఇంకొకరు పోస్ట్ చేశారు. "ఎక్కువ టైం స్క్రీన్ చూస్తే ఇప్పుడు జీతం లభించనుంది" అంటూ మరొకరు స్పందించారు. ఇలా చాలామంది స్పందిస్తున్నారు. డూమ్ స్క్రోలర్ అంటే ?: ఎక్కువ సమయంలో ఫోన్ స్క్రీన్ స్క్రోల్ చేస్తూ గడిపేవారిని డూమ్ స్క్రోలర్ అని అంటారు. ముఖ్యంగా వారు స్క్రోల్ చేసే వాటిలో ప్రతికూల, ఆందోళన కలిగించే స్టోరీస్ ఉంటా యి.

తర్వాత కాలంలో ఆ పదానికి అర్థం మారింది. ఎక్కువ సమయం స్క్రీన్ చూసేవారిని ఎవరినైనా డూమ్ స్క్రోలర్‌గా పిలుస్తున్నారు. ఇక, డిజిటల్ మీడియా ఏజెన్సీ మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా రణవీర్ అల్హాబాదియా కూడా ఉన్నారు. అతడు కొన్ని నెలల క్రితం వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గన్న వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శఅంగారం పైన ప్రశ్నించి వివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

## గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ ను వెంటనే చదును చేయ్యాలి

**గోదావరిఖని,తెలంగాణ దిశ :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత ంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం (గ్రౌండ్) ను వెంటనే చదును చేయాలని కళాశాల ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగిందని ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలోనే ఉస్మానియా యూనివర్సిటీని తలపించే విధంగా డిగ్రీ కళాశాల ఉందని, అలాంటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంను మెడికల్ కళాశాలకు కేటాయించి, డిగ్రీ కళాశాలకు మైదానం లేకుండా గత ప్రభుత్వం కుట్ర చేసిందని ఆయన అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ఎంతోమంది విద్యార్థులు పోలీస్,ఆర్మీ ఉద్యోగాలకు సాధించారని, గ్రౌండ్ లేకపోవడం వల్ల ఎన్ సి సి,ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు ఇబ్బందుల కు గురవుతున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంటనే ఎన్ సి సి,ఎన్ ఎస్‌ఎస్‌కి పెట్టింది పేరు అని ఆయన అన్నారు. రామగుండం ఎమ్మెల్యే ప్రభుత్వ డిగ్రీ కళాశాల పై ప్రత్యేక దృష్టి సరించాలని , విద్యార్థులు గమ్యాన్ని చేరే విధంగా సంబంధిత విద్యాధికారులు కూడా స్పందించి వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ ను చదును చేసి విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావా లని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థు లతో కలిసి ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# పేరుకుపోతున్న డిఏ బకాయిలు

## ఉద్యోగుల్లో ఆందోళన!




**అమరావతి,తెలంగాణ దిశ :** ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డిఏ బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇప్పటివరకు మూడు డిఏలు పెండింగ్లో ఉండగా, నాలుగో డిఏ కూడా కొద్ది రోజుల్లో జత కాబోతోంది. దీనితో కలిపితే వది నుండి 12 వేల కోట్ల రూపాయలు ఉద్యోగులకు చెల్లించాల్సిఉంటుందని ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడం పట్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బకాలు కోసం ఎన్నిసార్లు వినతులు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో 2.73 శాతంగా ఉన్న డిఏ 2023 జూలై నాటికి 33.67 శాతానికి చేరుకుంది. అయితే అప్పటి నుంచి డిఏ విడుదల కావడం లేదు. అనేక సార్లు ఉద్యోగులతో ఆర్థికశాఖ సమావేశాలు నిర్వహిం చడం, మధ్యలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీలు జరగడం, వాటిల్లో ఉద్యోగులు తమ డిమాండ్లను వెల్లడిం చడం మాత్రమే కనిపించింది తప్ప పరిష్కారం మాత్రం కనిపించలేదు. రెండు రోజుల క్రితం జరిగిన జెఎన్ సి సమావేశంలో ఇదే అంశంపై చర్చ జరిగింది. ఆ మరుసటి రోజు జరిగిన మంత్రివర్గ భేటీలో డిఏల ప్రకటన ఉంటుందని ఆశగా ఎదురుచూసినప్పటికీ నిరాశ తప్పలేదు. ఇదే సమయం పిఆర్ సి కమిషన్ నియామకం జరిగినప్పటికీ, ఎప్పుడు చర్చలు ఉంటాయి. ఎప్పుడు నివేదిక ఉంటుంది. ఎప్పుడు అమలులోకి వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఉద్యోగులు వాపోతున్నారు.

# పీసీసీ చీఫ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కొత్తపల్లి బిజెపి శ్రేణులు

## మహేష్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం





**కరీంనగర్,తెలంగాణ దిశ :** బిజెపి పార్టీపై,కేంద్ర మంత్రివర్యులు బండిసంజయ్ కుమార్ పై పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై కొత్తపల్లి బిజెపి మండల పార్టీ నాయకులు కార్యకర్తలు భగ్గుమన్నారు. మహేష్ గౌడ్ వ్యాఖ్యలను నిరసిస్తూ, ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు కుంట తిరుపతి మాట్లాడుతూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కు మతిభ్రమించినట్లు ఉందన్నారు. బిజెపిపై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను మండల శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఓట్ చోరీతో బిజెపి గెలిస్తే, కాంగ్రెస్ కూడా ఓట్ చోరీతో గెలిచిందా అనే విషయంపై మహేష్ గౌడ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహేష్ గౌడ్ వి దిమాక్ లేని మాటలని,ఓట్ చోరీ జరిగితే తెలంగాణలోబీజేపీ 8 పార్లమెంట్ సీట్లు ఎందుకు వస్తాయి..?అని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రజల కోసం, హిందుత్వం కోసం, దేశం కోసం , దేవుళ్ళ కోసం బిజెపి ఆలోచన చేస్తుంది , కొట్లాడుతుంది. వీటి కోసం బీజేపీ పని చేయడం తప్పు...? బిజెపి గురించి దేశ ప్రజలకు అర్థమైంది కాబట్టి వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. 55 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ గురించి ప్రజలకు అర్థమైంది కాబట్టి కాంగ్రెస్ అడ్రస్సును ప్రజలు దేశవ్యాప్తంగా గల్లంతు చేశారన్నారు. ఆరూ గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ మోసం ప్రజలకు అర్థమైందని, ప్రజలు కాంగ్రెస్ పై తిరగబడే స్థితులు నేడు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చడానికి జనహిత యాత్ర పేరిట కాంగ్రెస్ దొంగ నాటకాలు మొదలుపెట్టిందని ఆయన మండిపడ్డారు. యాత్రలో కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకో వడానికి, ప్రజలకు చేసిన మేలు ఏది లేక, బిజెపిపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా కరీంనగర్లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గెలుపు పై మహేష్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపనీయమన్నారు. కరీంనగర్ పార్లమెంటు సర్వతో ముఖ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, వేలకోట్ల నిధులతో కరీంనగర్ పార్లమెంటు ముఖచిత్రాన్ని బండి సంజయ్ కుమార్ మారుస్తున్నారని తెలిపారు.

కరీంనగర్ పార్లమెంట్ ప్రజల ఆశీస్సులుబండి సంజయ్ కుమార్కు ఉండడంతోనే రెండవసారి భారీ మెజారిటీ తో గెలుపొందారని తెలిపారు. అలాంటి గెలుపును, కరీంనగర్ పార్లమెంట్ ప్రజల తీర్పును అపహస్యం చేసే విధంగా మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నారు. మహేష్ గౌడ్ వెంటనే కరీంనగర్ పార్లమెంటు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# గుండారంలో శ్రీ సత్యసాయి గ్రామోత్సవ వైభవం

**- గ్రామంలో ఆధ్యాత్మికత అనుభూతి**
**- గ్రామంలోని పలువురు సేవకులను గుర్తించి సత్కారం**
**- గ్రామ సేవ ముక్తినందిస్తుంది.**
**-సత్యసాయి సమితి, 8వ కాలనీ కన్వీనర్ నూక రమేష్**




**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలోరాత్రి సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయిబాబా వారి శతజయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమం శ్రీ సత్యసాయి గ్రామోత్సవం 8వ కాలనీ సమితి ఆధ్వర్యంలో గుండారం లో భక్తి, సేవా భావంతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామ వీధుల గుండా భగవాన్ నామసంకీర్తన భజన కార్యక్రమం, జి.రాజయ్య గారి ఇంటి నుండి హనుమాన్ దేవస్లయ్ వరకు నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవకు గ్రామస్తులు మంగళహార తులతో స్వాగతం పలికారు. ఇంటింటా సాయి ప్రతి ఇంట సాయి కార్యక్రమంలో భాగంగా నూతన భక్తులకు స్వామివారి చిత్రపటాల ను అందించారు. తదుపరి హనుమాన్ ఆలయంలో నిర్వహించిన శ్రీ సత్యసాయి గాయత్రి కర్పూరహోమం, కుంకుమ పూజ, బాలవి కాస్ వారిచే వేద పారాయణం, అష్టోత్తరం, తధితర ఆధాత్మిక కార్యక్రమాలను తిలకిస్తూ భక్తిలో లీనమయ్యారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య, ఆశా కార్మికులు, వైద్య సేవకులు ఏఎన్ఎం ఆలయ అర్చకులు, సేవకులు, ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను కొనియా సన్మానించారు. భీమరథ శాంతి కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఒకా జంటకు పాద పూజా చేసి ఘనంగా సన్మానించారు. భక్తి పారవశ్యంలో లీనమై అందరూ సంతోష సంబరాలతో జరుపుకున్న ఈ వేడుక అందరికి ఆధ్యాత్మికత అనుభూతినిచ్చింది. భక్తితో స్వామివారిని వేడుకొని, నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రసాదం ఆరగించినారు. 8వ కాలనీ సత్యసాయి సమితి ప్రాథమిక సభ్యులు, భజన మండలి, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి నిర్వహించిన ఈ ఉత్సవ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సమితి 8వ కాలనీ సమితి కన్వీనర్ నూక రమేష్ సందేశం ఇస్తూ అందరూ సామూహికంగా పెదవులతో ప్రార్థిస్తూ, తమ చేతులతో సేవ చేయాలని, లవ్ ఆల్-సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్-హర్ట్ నెవెర్ అనే సత్యసాయి నినాదంతో ముందుకు నడుస్తున్న సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అవకాశం ఇచ్చిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతు గ్రామ సేవచేసి ముక్తిని పొందాలనే సత్యాన్ని, సాయి బోధనలు, సంస్థ సేవలను వివరించారు. ఇంకా ఈ గ్రామోత్సవంలో సత్యసాయి సమితి పెద్దపెల్లి జిల్లా కోఆర్డినేటర్లు రాజేశం, సుబ్బారావు, ఉదయ్, ఇందిరా కుమారి, సేవదల్ కే బుగ్గాజి, మహేందర్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, టి. శ్రీనివాస్, భాస్కర్ మహిళా సేవాదళ్ రాజ్యలక్ష్మి, మల్లేశ్వరి, జి.రాజయ్య, టి శ్రీనివాస్, ఏ మహేందర్ రెడ్డి, ఆలయ కమిటీ, పుర ప్రముఖులు, గ్రామస్తులు, భక్తులు, బాల వికాస్ చిన్నారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిపై క్రిమినల్ కేసు

**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన సంఘటనపై సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్‌పై భూపాలపల్లి మండల విద్యాధికారి అజ్మీరా దేవ భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ భూపాలపల్లి సైన్స్ టీచర్ పెండ్యాల రాజేందర్, ప్రత్యేక అధికారితో విభేదాల కారణంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని హానికర చర్యలకు పాల్పడినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. వివరాల ప్రకారం, ప్రస్తుత ప్రత్యేక అధికారి వెంకట నర్సయ్యపై వ్యక్తిగత విభేదాల కారణంగా సైన్స్ టీచర్ రాజేందర్, పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా కుట్ర పన్నినట్లు ఆరోపణ లు ఉన్నాయని తెలిపారు. ఆ కుట్రలో భాగంగా, 21/22-08-2025 అర్ధరాత్రి సమయంలో తాగునీటి ట్యాంక్ లో హానికరమైన పురుగుమందు కలిపినట్లు విద్యార్థులు గమనించి తెలిపారని అన్నారు. దీని వల్ల 11 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, భూపాలపల్లిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన జిల్లా విద్యా అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల ని విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. రాజేందర్ పై భూపాల పల్లి పోలీస్ స్టేషన్లో సిఐ నరేష్ కుమార్‌క్రైమ్ నెం. 467/2025 యూ/ఎస్ 109 బీ ఎన్ ఎస్ హత్యయత్నం కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

# లాభమా?.. నష్టమా?




అమెజాన్,ఫ్లిప్‌కార్ట్, మీషో, మింత్రా ఇలా అనేక ఆన్‌లైన్ షాపింగ్ వేదికల్లో పండుగ సీజన్ వచ్చిందంటే చాలు ఎక్కడలేని ఆఫర్లు కనిపిస్తాయి. కస్టమర్లను టెంప్ట్ చేసేలా ఉంటాయవి. వీటిలో పలు ఈఎంఐ ఆఫర్లు, ప్రధానంగా నో-కాస్ట్ ఈఎంఐ ఆఫర్లు దర్శన మిస్తుంటాయి. ఎస్బీఐ, యాక్సిస్, ఐసీఐసీఐ, కొటక్ మహీంద్రా, ఫెడరల్, హెచ్‌డీఎఫ్‌సీ తదితర బ్యాంకులతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి నాన్ బ్యాంకింగ్ సంస్థలూ వీటిని అందిస్తాయి.

అయితే మీరు చేసే లావాదేవీకి సంబంధించి ఉన్న డాక్యుమెంట్లను పూర్తిగా చదివితే ఉత్తమం. ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్ ప్రకటనల్ని చూస్తే.. 'మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. స్కీంకు సంబంధించిన అన్ని పత్రాలను జాగ్రత్తగా చదవండి' అని ఉంటుంది.

దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు డాక్యుమెంట్లలో ఏముందనేది తెలుసుకోవడం ఎంత ముఖ్యమోనని. కనుక మనకు తెలియని కొన్ని చార్జీలు కూడా ఈ నో-కాస్ట్ ఈఎంఐలకు జత కలిసి ఉండొచ్చు. అన్నిసార్లూ ఇలాగే ఉంటుందనేది కాదు. కానీ ముందే పరిశీలించడం తెలివైన పని. మీరు కొనే వస్తువు ధరను మీరు ఎంచుకున్న నెలలతో భాగించండి. ఆ వచ్చేదే ఈఎంఐగా ఉంటే సమస్య లేదు. అంతకన్నా ఎక్కువగా ఉంటే ఏవేవో చార్జీలు పడ్డాయన్నమాటే. ఆయా బ్యాంకులనుబట్టి ఇవి రూ.199 నుంచి రూ.299దాకా ఉంటాయి. అలాగే ప్రాసెసింగ్ ఫీజులుంటాయి. వీటిపై జీఎస్టీ సైతం పడుతుంది. ఇక ఒక్క ఈఎంఐ చెల్లించకపోయినా.. ఆలస్య రుసుములు, జరిమానాలు, వడ్డీలు విధిస్తారు. పైగా క్రెడిట్ స్కోర్ దెబ్బ తింటుంది. సంప్రదాయ మార్కెట్‌లో..:

ఈఎంఐల్లో కాకుండా ఒకేసారి నగదు చెల్లించి కొనే వీలుంటే.. ఒక వస్తువుపై ఆన్‌లైన్‌లో కనిపించే ధరకన్నా మన దగ్గర్లోని దుకాణాలు లేదా ఆయా స్టోర్లలోనే దాని రేటు తక్కువగా ఉంటుంది. అందుకే ఏదైనా వస్తువును ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయాలనుకుంటే మార్కెట్‌లో రేట్లు ఎలా ఉన్నాయి? అన్నది చూసుకోవాలి. దుకాణదారులతో బేరమాడితే ఇంకాతక్కువకు వచ్చే వీలున్నది. పైగా ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర అనవసరపు చెల్లింపులకు తావులేకుండా డీల్ చేసుకోవచ్చు. కాబట్టి ఈపండుగ సీజన్ షాపింగ్‌ను పక్కాగా ప్లాన్ చేసుకోండి. బయట మార్కెట్‌లో, ఆన్‌లైన్‌లో ఏయే ధరలున్నాయి అన్నది చూసుకోండి. బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులపైలభించే ఆఫర్లనూ గమనించి ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# సర్కారీ ఆఫీసుల్లో.. సోలార్ వెలుగులు



**మెదక్,తెలంగాణ దిశ :** ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్స హించడంతో పాటు కరెంట్ బిల్లుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ క్రమంలో దృష్టి సారించిన యంత్రాంగం సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రభుత్వ భవనాలు, వాటికి వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్ల వివరాల సేకరణలో నిమగ్నమైంది. పూర్తిస్థాయి సమాచారం సేకరించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వా నికి నివేదించాలని ఆదేశించినప్పటికీ భారీ వర్షాల నేపథ్యంలో ఆలస్యమైంది. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటు కు చర్యలు చేపట్టనున్నా రు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. దీంతో బిల్లులు భారీగా వస్తున్నాయి. సరిపడా నిధులు లేనికారణంగా పలు శాఖలు కరెంట్ బిల్లులు సైతం చెల్లించలేని పరిస్థితి. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపో తున్నాయి.

ఇది ప్రభుత్వానికి తీవ్ర భారమవుతోంది. దీనిపై దృష్టి సారించిన సర్కారు జిల్లాలోని ఆసుపత్రులు, అంగన్వాడీలు, పాఠశాలలు, పంచా యతీ, ఇతర కార్యాలయాల భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్లను టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాల భవనాల గుర్తింపునకు కసరత్తు చేపట్టింది. ఇటీవల అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ భవనాల వివరాలు అందించాలని ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో కార్య దర్శులు వివరాలు సేకరిస్తుండగా , మున్సిపల్ పరిధిలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.

భవనం పై కప్పు విస్తీర్ణం, విద్యుత్ కనెక్షన్ కేటగిరీ, నెల వారీగా వినియోగం వంటి సమాచారం సేకరిస్తున్నారు. విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే చోటఎల్టీ, ఎక్కువగా ఉన్న భవన సముదాయాలపై హెచ్టీ సర్వీసులతో కూడిన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

కలెక్టరేట్,జిల్లా ఆసుపత్రి వంటి విశాల భవనాలపై

100 కిలో వాట్లకు పైబడి సామర్థ్యంతో కూడిన ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా ప్రతిపాదలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. బడ్జెట్ కేటాయింపు లకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నారు. తద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రయోజ కనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# అంతకంతకు పెరుగుతున్న అప్పులు..?




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** "రోడ్లు వేస్తున్నాం. విమానాశ్రయాలు నిర్మిస్తున్నాం. మెడికల్ కాలేజీలు కడుతున్నాం. అందరికీ తాగునీరు అందిస్తున్నాం. దేశ సౌభాగ్యాన్ని సరికొత్త పుంతలు తొక్కిస్తున్నాం.. గడచిన పది సంవత్సరాలలో దేశ అభివృద్ధిని పరుగులు పెట్టించాం. ప్రపంచ వేదికల మీద మన దేశానికి సమున్నత స్థానాన్ని కల్పించాం" ఇలానే ఉంటున్నాయి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు. మనదేశంలోనే కాదు, ప్రపంచ వేదికల మీద ఆయన ఇలానే మాట్లాడుతున్నారు.వాస్తవానికి ఆయన మాటల్లో కొంత నిజం ఉండొచ్చు.కానీ భారతదేశ అప్పులు మాత్రం అంతకంతకు పెరుగుతున్నాయి.. నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన నాటు నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అప్పు రెండు వందల లక్షల కోట్లకు చేరుకుంది. ఇది దేశస్తుల జాతీయ ఉత్పత్తిలో 56.1 శాతానికి చేరుకుంది. కేంద్రానికి వివిధ రూపాలలో వస్తున్న ఆదాయంలో 37.32% రుణాలకు సంబంధించి చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతుంది. ఇదేదో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కాదు.. సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన వివరాలు.2015 -16 లో కేంద్రం అప్పులు 70.88 లక్షల కోట్లు ఉండగా.. గడచిన పది సంవత్సరాలలో అది 18,190 శాతం పెరిగింది. స్థూల జాతీయోత్పత్తిలో రుణాలకు సంబంధించిన నిష్పత్తి 51.5 నుంచి 56.1 శాతానికి చేరుకుంది. దశాబ్ద కాలంలో కేంద్రం 100 లక్షల కోట్లకు మించి అప్పు చెల్లించింది. ఇందులో అసలు 32.61 లక్షల కోట్లు కాగా.. వడ్డీ 85.17 లక్షల కోట్లు కావడం విశేషం. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో వడ్డీలకు సంబంధించిన చెల్లింపుల కోసం 2015 -16లో 36.96% ఉండగా.. ఇప్పుడు ఏకంగా అది 37.32 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే అప్పులలో తమిళనాడు 9.55 లక్షల కోట్లతో మొదటి స్థానంలో ఉంది. 8.57 లక్షల కోట్లతో ఉత్తర్ ప్రదేశ్ రెండవ స్థానం, మహారాష్ట్ర 8.12 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉన్నాయి. కేంద్రం అప్పులు 200 లక్షల కోట్లకు చేరిన నేపథ్యంలో ప్రతిపక్షాలు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. తాము అధికారంలో ఉన్నప్పుడు దేశ ప్రజల ఆదాయానికి లోబడి అప్పులు చేశామని.. ఇప్పుడు కేంద్రం మాత్రం ఇష్టానుసారంగా అప్పులు చేస్తోందని.. అప్పులకు తగ్గట్టుగా అభివృద్ధి మాత్రం కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. బిజెపి ప్రతిపక్షంలోఉన్న రాష్ట్రాలలో అప్పుల గురించి మాట్లాడుతోం దని.. కేంద్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో వారు తెచ్చిన అప్పుల గురించి మాట్లాడటం లేదని సెటైర్లు విసురుతున్నది.

# ఇంజనీరింగ్ కాలేజీల క్వాలిటీ ఆధారంగానే ఫీజులు..

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పాత ఫీజులే బీ టెక్ కాలేజీల్లో అమలులో ఉంటాయని కౌన్సెలింగ్ నిర్వహించారు. చాలా మంది విద్యార్థులు కూడా ఆయా కాలేజీల్లో జాయిన్ అయ్యారు. దీంతో గత సంవత్సరం ఎలాంటి ఫీజులు వసూలు చేశారో.. ప్రస్తుతం కూడా అవే ఫీజులు వసూలు చేశారు. ఆ ఫీజులకే విద్యార్థులు అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. అయితే ఎప్పటి నుంచో ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఫీజులు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా.. వీటిపై స్పందించిన రాష్ట్ర తెలంగాణ ప్రభుత్వం ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ఫీజుల పెంపుపై ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఫీజుల పెరుగుదల కేవలం యాజమాన్యాల డిమాండ్ ఆధారంగా కాకుండా.. ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న విద్య నాణ్యత, ప్రమాణాలను బట్టి మాత్రమే నిర్ణయించబడుతుందని పేర్కొంది. దీనికి సంబంధించి ప్రభుత్వం కొత్త నిబంధనలను జారీ చేసింది. ఇప్పటికే ప్రవేశాలు, తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ఈ కొత్త విధానం ప్రాధాన్యతను సంతరి ంచుకుంది.విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతోనే ఈ మార్పులు తీసుకొచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది.

కొత్త ఉత్తర్వుల ప్రకారం, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజులను నిర్ణయించే ముందు అనేక అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.విద్యార్థుల హాజరుశాతం,ఫేషియల్ రికగ్నిషన్అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు, పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించడం వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే.. కళాశాలలు ఇస్తున్న విద్య నాణ్యత, విద్యార్థులకు లభించే ప్లేస్‌మెంట్ అవకాశాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనల అమలును కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. ఒక సమగ్రమైన నివేదిక ఆధారంగానే ఫీజుల పెంపుపై నిర్ణయం ఉంటుంది.ఈ విధానంవల్ల నాణ్యమైన విద్యను అందించే కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేయడానికి అవకాశం లభిస్తుంది. అదే సమయంలో.. తక్కువ ప్రమాణాలతో నడుస్తున్న కళాశాలలకు ఫీజుల పెంపు ఆశించినంతగా ఉండకపో వచ్చు. ఇది ఇంజనీరింగ్ విద్యలో ప్రమా ణాలను పెంచుతుం దని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులు ఇకపై కేవలం ఫీజుల ఆధారంగా కాకుండా.. కళాశాల నాణ్యతను బట్టి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ మార్పుల వల్ల తెలంగా ణలో ఇంజనీరింగ్ విద్య మరింత పారదర్శకంగా, జవాబుదారీగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అటువిద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు కళాశాలల ఎంపికలో ఈ కొత్త నిబంధనలను దృష్టిలోఉంచుకోవాల్సి ఉంటుంది.ఏటా లక్షల్లో విద్యార్థులు బీటెక్ పూర్తిచే సుకొనిబయటకు వస్తున్నారు. క్యాంపస్ ప్లేస్ మెంట్స్ అనేవి కొంత మందికి మాత్రమే వస్తున్నాయి. రానివాళ్లు బయట మార్కెట్లో ఉద్యోగం కోసం ప్రయ త్నిస్తున్నారు. చదివిన చదువుకు సంబంధం లేకుండా ఉద్యోగాలు చేసేవారు ఇప్పటికే చాలా మంది ఉండగా.. కొత్తగావచ్చేవారితో ఆసంఖ్య పెరుగుతోంది.దీనికి గలకారణం విద్యా ర్థులు కమ్యూనికేషన్ స్కిల్స్,నాణ్యమైన విద్య లేకపోవడమే. దీనిలో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# మణుగూరులో బూడిద బతుకులు


## మసిబారుతున్న పల్లెలు

**మణుగూరు,తెలంగాణ దిశ :** భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వెలుగులతో పాటు సమీప గ్రామాలకు వ్య ర్థాలను పంచుతోంది. పొగ ద్వారా వచ్చే వా యు కాలుష్యానికి తోడు బొగ్గుమండించగా మిగిలిన బూడిద ప్రజలను కమ్మేస్తుంది. ప్రజలతో పాటు పశువులు సైతం అనారోగ్యానికి గుర వుతున్నాయి. పల్లెల నుండి పచ్చని చెట్ల వరకుబూడిద కమ్మేయడంతో ఎండి పోతున్నాయి. పంటలు సైతం వేయలే కపోతున్నా మని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గ్రీన్ బెల్టు ఏర్పాటు, రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మ కునీరెత్తినట్లు వ్య వహరిస్తున్నా రనీ, చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు దీర్ఘకాలిక రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంటు (బిటిపిఎస్) పరిసర గ్రామాల ప్రజల ఇబ్బందుల పై విజయ క్రాంతి పరిశీలనాత్మక కథనం...ఎక్కడైనా పరిశ్రమలు వ స్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు వస్తాయి.కానీ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న బిటిపి ఎస్ పరిసర పల్లెలకు పరిశ్రమ శాపంలా మారిందని గ్రామాలలో కాలుష్యం భయాం దోళనలు రేకెత్తిస్తోందని, థర్మల్ స్టేషన్ నుంచి వెలువడే పొగ,బూడిద వల్లవాయు, జల కాలుష్యం ఏర్పడు తోం దని స్థానికులు చెబుతున్నారు. రోజుకు వం దల సంఖ్య లో లారీల ద్వారా బూడిద తరలింపు జరపడం వ ల్ల చుట్టుపక్కల గ్రామా ల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరిందని వాపోతు న్నారు.ప్లాంట్ చిమ్నీల నుంచి వెలువడే పొగ ఉ క్కిరి బిక్కిరి చేస్తుండ గా బూడిద వ్యర్థాలు గాలిలో కలసి కాలుష్యం పెరిగి పచ్చటి పల్లెలను బూడిద కమ్మే స్తోంది. థర్మల్ ప్లాంట్ నుంచి వెలువడే వాయుకాలుష్యం దెబ్బకు పరి సర గ్రామాలు విలవిల లాడు తుండగా ఆయా కాలుష్య కారకాలను పీల్చుకుని ప్రజ లు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఇక పశు పక్ష్యాదుల సంగతి సరే సరి.

విష పూరిత కాలుష్య రేణువులు వెలు వడకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నా..బిటిపి ఎస్ అధికారుల పట్టింపులేని తనంతోనే తమకు ఈ ఇబ్బందులు ఎదురవు తున్నాయని బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలు, ఆం దోళనలు చేసి నప్పుడు ప్రజా ప్రతినిధుల సమక్షంలో హామీలుఇస్తున్నా.. ఆత ర్వాత వాటిని తుంగలో తొక్కడం షరామా మూలైందని మండి పడుతున్నారు... కళ్లు, ఒళ్లు మండి పోతున్నా యని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు.భద్రాద్రి పవర్ ప్లాంట్ నుండి వెలు వడుతున్న బూడిద (యాష్) తరలించే బూడిద ట్యాంకర్లే ప్రధాన రహదారి నిండా దర్శనమిస్తున్నాయి. వాటి మూలంగా అనేక ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. ట్యాంకర్ల నుండి వెలువడుతున్న బూడిదతో పీల్చేగా లి... తినే తిండి.. తాగే నీరూ కలుషితమై ప్రజలను అనారోగ్య పాలు చేస్తోంది. శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు, చర్మ సంబంధిత వ్యాధులతో జీవితాలు మసకబారి పోతున్నా యి.చివరకు పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు బూడిద ముసిరిన బతుకులుగా మారుతున్నాయి. బూడిద, దుమ్ము, ధూళి కారణంగా ఒంటిపై దద్దుర్లు , చర్మంపై మచ్చలు వస్తున్నా యని, ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పరిశ్రమ ప్రభావిత గ్రామాలో యాజ మాన్యం తో పాటు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారం వారం వైద్య పరీక్షలు చేయా ల్సి ఉన్నా గ్రామాల్లో ఆపరిస్థితి కనిపించడం లేదని. ప్రారంభంలో కొంత కాలం సీఎస్ ఆర్ కింద యాజమాన్యం మొక్కుబడి శిబిరాలు నిర్వహిం చినా.. ఇ ప్పుడు తమ వైపు కన్నెత్తి చూడటం లేదనిబాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్లాంట్ నుండి వెలబడుతున్న యాష్ కా రణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అ నేక ఇబ్బందులకు గురవుతున్నారు. త్రాగే మంచి నీటి నుండి పండించే పంటల వరకు ప్రజలుఇ బ్బందులను పడుతున్నారు. పరిసర గ్రామాలైన చిక్కుడు గుంట, దమక్క పేట, సాంబాయి గూడెం, రాయిగూడెం, పోతిరెడ్డి పల్లి, ఏడుల్ల బయ్యారం, సీతారాంపు రం, ఉప్పాక, బొమ్మరాజుపల్లి తదితర గ్రామాల ప్రజలు నిత్యం బూడిదతో సహ జీవనం చేస్తున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా పవర్ ప్లాంట్ ను కొనసాగించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదే శాలు ఉన్నప్పటికీ వాటిని పాటించడంలో బిటిపిఎస్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. నిత్యం మంచు దుప్పటిలా గ్రా మాలన్నీ బూడిదతో దర్శనమిస్తున్నాయి. వచ్చని చెట్లు బూడిద పారి నల్లగా మారిపోతున్నాయి.వరి, ఎత్తి, మిరప సాగుచేసే రైతుల కు దిగు బడులు తగ్గి అర్థం కాని పంట తెగు ళ్లతో నష్ట పోతు న్నామని ఆందోళన చెందు తున్నా రు .ఈ విషయంపై రాజ కీయనా యకులు,పలువురు ప్రకృతి ప్రేమికులు పలు మార్లుచర్యలు తీసుకోవా లని కోరిన కాలు ష్య సమస్యను అరికట్టడంలో ప్లాంట్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా పవర్ ప్లాంట్యాజమాన్యం స్పందించి గ్రామాలలో కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# అమెరికా చదువులపై అనిశ్చితి!

## ట్రంప్ సర్కారు విధానాలే కారణం - సగానికి తగ్గిన భారత విద్యార్థులు



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల వల్ల స్టూడెంట్ వీసాలపై అమెరికాకు వెళ్లేవారి సంఖ్య జూలైలో దారుణంగా తగ్గిపోయింది. జూలైలో కేవలం సుమారు 79,000 మంది మాత్రమే అమెరికాకు వెళ్లారు. 2025లో నెలవారీ గణాంకాలను పరిశీలించినపుడు జూలైలోనే అత్యధికంగా 28 శాతం తగ్గుదల కనిపించింది. భారత్ నుంచి వెళ్లే విద్యార్థులు 46 శాతం మేరకు తగ్గిపోగా, చైనా నుంచి వెళ్లేవారు 26 శాతం వరకు తగ్గిపోయారు. నిరుటితో పోల్చుకున్నపుడు వరుసగా నాలుగో నెలలో ఈ తగ్గుదల నమోదైంది. యూఎస్ ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేషన్ డాటాను విశ్లేషించిన బ్లూమ్‌బెర్గ్ ఈ వివరాలను వెల్లడించింది. 2023-24 విద్యా సంవత్సరంలో 3,32,000 మంది భారతీయ విద్యార్థులు అమెరికన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఎన్‌రోల్ అయ్యారు. ఆ ఏడాదిలో విదేశీ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులే. ఆ తర్వాతి స్థానంలో 2,77,000 మందితో చైనా విద్యార్థులు ఉన్నారు. ఆ సంవత్సరంలో రికార్డు స్థాయిలో 11 లక్షల మంది విదేశీ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. మొదటిసారి

అమెరికాకు వెళ్లే విదేశీ విద్యార్థులు 30 శాతం మేరకు తగ్గుతారని ఆ దేశంలోని విద్యా సంస్థలు అంచనా వేశాయి. ఫలితంగా 2.6 బిలియన్ డాలర్ల మేరకు ట్యూషన్ రెవిన్యూ నష్టం వస్తుందని అంచనా వేశాయి. మరో అంచనా ప్రకారం, ఈ ఏడాదిలో 1,50,000 మంది విద్యార్థులు తగ్గుతారని, ఫలితంగా ఆగస్టు చివరి-సెప్టెంబరు ప్రారంభంలో సెమిస్టర్‌లో హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్టర్‌కు 7 బిలియన్ డాలర్ల నష్టం వస్తుందని, అమెరికాలోని వివిధ నగరాల్లో 60,000కుపైగా ఉద్యోగాలపై ప్రభావం పడుతుందని తెలుస్తున్నది.

**బిగ్ బ్యూటిఫుల్ కాదు, బిగ్ అగ్లీ చట్టం!:**

ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్ వల్ల అనేక మార్పులు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలకు నిధుల కోత, ఉద్యోగులపై వేటు వంటి వాటితో పాటు భారతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. తాజాగా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ 6,000కుపైగా స్టూడెంట్ వీసాలను రద్దు చేసింది. వీసా స్క్రూటినీ కఠినతరం అయింది. వీటిలో సుమారు 4,000 వీసాల రద్దుకు కారణం క్రిమినల్ ఉల్లంఘనలని, ఉగ్రవాదానికి మద్దతిచ్చినందుకు 200-300 వరకు రద్దయ్యాయని తెలిపింది. మరోవైపు యూఎస్ ఇమిగ్రేషన్ అధికారులు వీసా దరఖాస్తుదారుల సామాజిక మాధ్యమాల ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా కానీ, యాంటీసెమెటిక్ కంటెంట్ కానీ ఉన్నాయేమో చూస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు పెట్టే ప్రతి పోస్టు ముప్పు తెచ్చిపెట్టేదిగా భావించవలసి వస్తున్నది.

**వీసా ఇంటర్వ్యూలు వాయిదా:** స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు కాన్సులేట్లు ఎఫ్-1 వీసాల కోసం కొత్త అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపేశాయి. దీంతో చాలా మంది ఆశావహులు చిక్కుకుపోయారు లేదా తమ ప్రణాళికలను వాయిదా వేసుకున్నారు. ఒకవేళ ఇంటర్వ్యూలు మంజూరైనా, దరఖాస్తుదారులు మునుపెన్నడూ లేనంత స్థాయిలో తనిఖీలకు గురవుతున్నారు.

# వీధి జంతువులతో జాగ్రత్త!



పెంపుడు జంతువుల పట్ల ప్రేమ ఉండటం సహజమే. కానీ వాటి ద్వారా వచ్చే కొన్ని దుష్పరిణామాలు కూడా తెలుసుకోవటం మంచిది. పశువులు, శునకాలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, కోళ్లు, పక్షుల నుంచి మనుషులకు కొన్ని వ్యాధులు సంక్రమిస్తాయి. పెంపుడు జంతువులను ఎవరి ఇంట్లో వాళ్లు పెంచుకుంటే మిగతా వారికి ఇబ్బందులు ఉండవు. కానీ, కొందరు విచక్షణా రహితంగా వీధుల్లో వదిలేస్తుండటమే ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

వీధి కుక్కలతో ఇబ్బందులు: ఇళ్లల్లో వదిలేసిన కుక్కలే వీధుల్లో తిరుగుతూ ఆ తర్వాత వాటి సంతతిని వృద్ధి చేసుకుంటు న్నాయి. ఇవి వీధుల్లో తిరుగుతూ ప్రజాజీవనానికితీవ్రఆటంకాన్ని కల్గిస్తున్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఇదే సమస్య. పౌర జీవనానికి ఇబ్బంది కల్గిస్తోంది. మిగతా ప్రాంతాల సంగతి అటుంచితే మన రెండు రాష్ట్రాల్లోనూ వీధి కుక్కల బెడద ఎక్కువైపోతోంది. మనదేశంలో 11 సెకన్లకో కుక్కకాటు కేసు నమోదవుతోంది. పసికందులు, వృద్ధులపైనా వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. 2024లో ఒక్క ఏడాదిలోనే దేశంలో 37 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ, విశాఖపట్టణం, తిరుపతి ఇలా అన్ని ప్రాంతాల్లో ఊర కుక్కలు గుంపులు గుంపులుగానే సంచరిస్తున్నాయి. పసిపిల్లలను ఎత్తుకెళ్లటం దగ్గర నుంచి పెద్దల రక్త మాంసాలను లాగేసే వరకూ వీటి ఉధృతి పెరిగింది.

విదేశాల్లో పద్ధతులు ఆచరణీయం: మనదేశంతో పోలిస్తే చాలా దేశాల్లో వీధి కుక్కలు పెద్దగా కనిపించవు. ఉన్నా వాటికి ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తారు. జనన నియంత్రణ ఇంజక్షన్లు సైతం చేసేస్తారు. వాటికి సంబంధించిన వివరాలు కుక్క మెడలో పొందుపర్చి ట్యాగ్‌లుగా ఉంటాయి. కుక్కల సంతతి నియంత్రణ చర్యలు చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మనదేశంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. వీధి కుక్కలతో ర్యాబిస్ ప్రబలితే అది పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదకర మవుతుంది. దీన్ని నివారించడానికి ప్రపంచవ్యాప్తంగా పలు పద్ధతులను పాటిస్తున్నారు. శునక జనన నివారణ శస్త్ర చికిత్సలు (ఎబిసి), ర్యాబిస్ టీకా కార్యక్రమాలు, సిఎన్‌విఆర్ పద్ధతిని కొన్నిచోట్ల అనుసరిస్తున్నారు.

కారుణ్య పద్ధతి విధానాన్ని ఒక్క రోజులోనే పూర్తి చేయొచ్చు. శ్రీలంక, థారులాండ్, ఇండోనేషియా, మాల్దీవులు వంటి దేశాల్లో దీన్ని విజయవంతంగా అనుసరిస్తున్నారు. వీధి కుక్కల సమస్య నివారణకు ఇది చక్కటి ప్రత్యామ్నాయమని తమిళనాడు వెటర్నరీ, జంతుశాస్త్రాల విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొన్న విషయం తెలిసిందే.

హడావుడి తప్ప ఆచరణ శూన్యం: దేశంలో ఏ ప్రాంతంలోనైనా రాత్రి 10 గంటల తర్వాత తమ ఇళ్లకు ప్రజానీకం వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పోవాల్సిందే. గుంపులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిని భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. రోడ్లపైనే ఉంటూ అక్కడ మలమూత్ర వ్యర్థాలు వదులుతూ కంపు కొట్టేలా చేస్తున్నాయి. అవి తెల్లవార్లూ అరుస్తూ ఉంటే నివాసితులు కంటిపై కునుకు లేకుండా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు రక్షణ చర్యలు ముఖ్యం: సమస్య తీవ్రతను గుర్తించి తెలంగాణా, ఆంధ్ర ప్రభుత్వాలు శునక జనన నివారణ శస్త్రచికిత్సలు, ర్యాబిస్ టీకా కార్యక్రమాల (ఎఆర్‌వి)కు ప్రత్యేకంగా బృందాలు ఏర్పాటు చేయటం ఎంతో మేలు. వీధి కుక్కల వీరంగాలపై ఫిర్యాదు చేయడానికి వీలుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు చేయాలి. హైదరాబాద్‌లో వీధి కుక్కలకు నూరు శాతం యాంటీ ర్యాబిస్ టీకాలు వేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించటం ఎంతో మంచి ఆలోచన. ఇలాంటి చర్యలు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ, అన్ని చోట్లా చిత్తశుద్ధితో అమలుచేస్తేనే వీధి కుక్కల భారి నుంచి ప్రజలకు రక్షణ లభిస్తుంది.

ఆలనలేని ఆవులు, ఎద్దులతో ప్రమాదాలు: రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులతో కూడా చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. కొందరు యజమానులు వాటికి దాణా వేయకుండా వీధుల్లోకి వదిలేస్తుండటంతో అవి స్వైర విహారం చేస్తూ పిల్లలు, పెద్దలు, మహిళలను పొడిచి, గాయపరుస్తున్నాయి. ప్రధాన రోడ్లపై పడుకుంటూ ప్రజల రాకపోకలకు అంతరాయాన్ని కల్గిస్తున్నాయి.

ఇటీవల ఆవు దాడిలో విజయవాడ కృష్ణలంకకు చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ నరసింహారావు మృతి చెందారు. పశువుల దాడిలో చాలామంది గాయపడిన ఉదంతాలు ఉన్నాయి. కొన్ని నగరాలు పట్టణాల్లో అధికారుల స్పందిస్తున్నా వాటి బందులదొడ్డిలో ఒకటి, రెండ్రోజులు ఉంచి జరిమానా వేసి పంపించేస్తున్నారు. అయినా సమస్య పరిష్కారానికి నోచుకోవటం లేదు.

## కోస్తా జిల్లాల్లో యాచకం...
# నిషేధం..



కాకినాడ: ఏపీ ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చూడాలని చూస్తోంది. ఇప్పటికే విశాఖలో పోలీస్ శాఖ ఆ పని చేస్తోంది. అయితే ఇప్పుడు ప్రధాన నగరాల్లో యాచకులు లేకుండా చేయాలని.. వృత్తిని నిరోధించే ఏపీ యాచక నిరోధక చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందనుంది. గవర్నర్ ఆమోదంతో చట్టాన్ని అమలులోకి తెస్తారు. ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలో ప్రధాన నగరాలుగా ఉన్న విశాఖ విజయవాడ, తిరుపతి, కర్నూలు, అమరావతి, గుంటూరు, రాజమండ్రి, విజయనగరంలో యాచక వృత్తిని నిషేధిస్తారు. యాచకులు లేని నగరాలుగా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం పేదరిక నిర్మూలనకు ఏపీ ప్రభుత్వం పి4 ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో పేదరికాన్ని సూచికగా ఉండే యాచకులు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాచకులు ఉన్నరాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్‌తొలి స్థానంలో ఉంది. తమిళనాడు రెండు, ఢిల్లీ మూడో స్థానంలో ఉంది. నాలుగో స్థానంలో ఏపీ కొనసాగుతోంది.అయితే ఏపీలో యాచకుల సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని చూస్తోంది. దానికి యాచకులు అవరోధంగా భావిస్తోంది. అందుకే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి, విద్యా వైద్యం వంటి సౌకర్యాలు కల్పించి.. సాధారణ పౌరులుగా జీవించేలా చేయనుంది. వారికోసం ప్రత్యేక షెల్టర్లను సైతం అందుబాటులోకి తేనుంది.విశాఖలో పోలీస్ శాఖ ద్వారాయాచకు లను షెల్టర్లకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చాలామంది గ్రామాల నుంచి వచ్చి యాచక వృత్తిని ఆశ్రయిస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. సంక్షేమ పథకాలతో పాటు పౌర సేవలు అం దించి వారిని సాధారణ పౌరులుగా మార్చుతున్నారు. విశాఖలో వీధిలోకనిపించే యాచకులను గుర్తిస్తున్నారు. నిరాశ్రయుల కు భోజన వసతి కల్పిస్తున్నారు. వారికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కరోనా తరువాత నగరాల్లో యాచకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ప్రముఖ దేవస్థానాలు ఉన్నచోట వీరు పెరుగుతూ వచ్చారు. తాజాగా ప్రభుత్వం యాచక వృత్తిని నిషేధించాలని భావించింది. ప్రధాన నగరాలతో పాటుప్రముఖ పుణ్యక్షేత్రాలను సైతం ఆ జాబితాలో చేర్చింది. తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, రామతీర్థాలు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సైతం ఇకనుంచి యాచకులు కనిపించకుండా పగడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

# ఏపీలో జాలీ ట్రావెలింగ్!


తిరుపతి, : ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మూడు మినీ ఎయిర్పోర్టులను తీసుకురా వాలని నిర్ణయించింది. హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి హెలికాప్టర్ సేవలు అందించడానికి ఏజెన్సీలను ఆహ్వానిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, అరకు ప్రాంతాల మధ్య ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో హెలికాప్టర్ పర్యాటకం నిరం తరం అందుబాటులో ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. నిరంతరం హెలికాప్టర్లు అందుబాటులో ఉంటాయి. పర్యాటక ప్రాం తాలను ఆకాశమార్గంలో చూసే అరుదైన అవకాశం కల్పించను న్నారు.రాష్ట్రంలో హెలిక్యాప్టర్ టూరిజం అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం మూడు ప్రాంతాల నుంచి హెలికాప్టర్లను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆసక్తి కలిగిన ప్రైవేట్ ఏజెన్సీ ల నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి.. ఎక్కడ హెలిప్యాడ్లను ఏర్పాటు చెయ్యాలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం హెలికాప్టర్ ద్వారా పర్యాటకులకు జాలి రైట్ కొన్ని సందర్భాల్లో మాత్రమే అందుబాటులో ఉంటోంది. ఇకనుంచి అలా కాకుండా నిరంతరాయంగా సేవలందిలా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం, మచిలీపట్నం, అరకు ఉత్సవాల్లో ప్రైవేట్ వీటిని నిర్వహించాయి. అక్కడ సక్సెస్ ఫుల్ గా కనిపించడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేస్తోంది.ప్రధానంగా పర్యాటక ప్రాంతాలను కలుపుతూ హెలిక్యాప్టర్లను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం చూస్తోంది. విజయవాడ నుంచి శ్రీశైలం, హైదరాబాద్ నుంచి శ్రీశైలం, అరకు నుంచి విశాఖ మధ్య హెలికాప్టర్ సేవలను నడపాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రతిరోజు విజయవాడ, హైదరాబాదు నుంచి భక్తులు శ్రీశైలం వెళ్తుంటారు. వారికోసం రెండు వైపులా హెలిక్యాప్టర్ సేవలు తీసుకొస్తే గిరాకీ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రూట్లో హెలికాప్టర్ సేవలు మొదలుపెడితే మంచి స్పందన వస్తుందని భావిస్తున్నారు.మరోవైపు విశాఖ జిల్లాలో మన్య ప్రాంతంలో మినీ ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది ఏపీ ప్రభుత్వం. చిన్న చిన్న విమానాలతో పాటు హెలికాప్టర్లు ల్యాండ్ అయ్యే విధంగా వీటిని నిర్మించాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. హెలికాప్టర్ టూరిజం ప్రోత్సహించే దిశగా విశాఖ, అరకు తో పాటు విజయవాడ, శ్రీశైలంలో వీటిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తోంది. సాధారణ విమానాశ్రయాల్లో ఉండే సౌకర్యాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న హెలిక్యాప్టర్ టూరిజం అనుగుణంగానే ఇక్కడ జాలీ ట్రావెలింగ్ కు ప్రభుత్వం యోచన చేస్తోంది.

## మృతుని కుటుంబానికి బియ్యం అందించిన ఆరెల్లి కిరణ్ గౌడ్

మంథని: మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో పులి ఓదెలు అని వృద్ధుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను యువజన కాంగ్రెస్ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సూరయ్యపల్లి మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జ్ ఆరెల్లి కిరణ్ గౌడ్ తనకు తోచినంతలో బియ్యం పంపించగా వారి సోదరుడు ఆరెల్లి వరుణ్ గౌడ్ మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రు విజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల సురేష్,హమాలి సంఘం అధ్యక్షుడు సుంకరి దేవేందర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులి సదానందం, బొల్లి సంతోష్ లు పాల్గొన్నారు.



## ఒడిశా వైద్యుడి ఔదార్యం.. 45 ఏళ్లుగా ఉచిత వైద్యం!



బ్రహ్మపుర: ఎనిమిది పదుల వయసులోనూ రోగులకు ఉచిత వైద్యం చేస్తున్నారు. దాదాపు 45 ఏళ్లుగా గిరిజనులకు, వెనుకబడిన ప్రాంతాల వారికి నిస్వార్థంగా సేవలుఅందిస్తున్నారు. ఆయనే ఒడిశాలోని బ్రహ్మపురకు చెందిన వైద్య నిపుణుడు డా.కృష్ణమోహన్. అందరికి అందుబాటులో వైద్యం కోసం జీవితాన్ని ధారపోసిన ఆయన.. తన కృషికి గుర్తింపుగా 2004లోఅప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ సర్జన్‌గా జాతీయ అవార్డు, 2021లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు.ఒడిశాలోని సుకుందా గ్రామంలో 1939 ఆగస్టు 1న జన్మించిన డా.కృష్ణమోహన్ ప్రయాణం.. కటక్‌లోని ఎస్‌సీబీ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పట్టాతో మొదలైంది. అనంతరం ఇంగ్లాండ్‌లో ఎంఎస్ పట్టా పొందారు.1972–75 వరకు కామ న్వెల్త్ మెడికల్ ఫెలోగా విధులు నిర్వహిస్తూ.. రాడ్‌క్లిఫ్ ఇన్‌ఫర్మరీ వంటి ప్రతిష్ఠా త్మక ఆస్పత్రుల్లో గుర్తింపు పొందారు. ప్రొఫెసర్ పదవి ఇస్తామన్న హామీ లభించినప్పటికీ.. స్వదేశానికి తిరిగివచ్చారు. బుర్లాలోని విమ్‌సార్ ), బ్రహ్మపురలోని ఎంకేసీజీ వైద్యకళాశాల, కలకత్తా, పట్నా విశ్వవిద్యాలయాల్లో కీలక పదవులు నిర్వహించారు.

# అరెస్ట్ అయితే ఔట్...

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు రభస చేశాయి. నేరారోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉండేవారు.. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగరాదంటూ ప్రభుత్వం కొత్త బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చింది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన 30రోజుల్లో రాజీనామా చేయాలి.. లేకపోతే పదవి దానంతట అదే పోతుందన్నది కొత్త బిల్లు ముఖ్యాంశముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. తీవ్రమైన అవినీతి, ఇతర నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు.. 30 రోజుల కంటే ఎక్కువగా పోలీసు కస్టడీలో ఉంటే ఆ మరుసటి రోజు నుంచి వారి పదవి ఉండదు. ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులందరికీ ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. 5 ఏళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే నేరారోణలు కలిగిన వారందరికీ ఈ నిబంధన వర్తింప చేయాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. దీనిపైనే ఇండియా అలయెన్స్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది.నేరం నిరూపణ అయ్యే వరకూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతివ్యక్తి అనుమానితుడు మాత్రమే.. నేరారోణపులు ఎదుర్కొంటున్న వ్యక్తికి నిష్పాక్షికమైన విచారణ కోరుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఆర్టికల్ 21లో ఇది ఓ భాగం. కానీ ఈ కొత్త బిల్లు నేరు నిరూపణ, శిక్ష లేకండానే... కేవలం ఆరోపణల మీద అరెస్ట్ అయినా సరే... పదవి వదులుకోవాలని కొత్త బిల్లులో ప్రతిపాదించారు. ఆర్టికల్ 21 ప్రతివ్యక్తికీ జీవించే హక్కును, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని కల్పించింది. నేరారోపణలు ఉంటే ఫెయిర్ ట్రయల్ పొందే హక్కు కల్పించింది. అలాగే ఆర్టికల్ 14 చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానులే అని చెబుతోంది. ఇప్పుడు తీసుకొచ్చే రాజ్యాంగ సవరణతో ఈ ప్రాథమిక హక్కులకే భంగం కలుగుతుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వెసులుబాటు.. అనేక సమస్యలకు కారణం అవుతోందని కేంద్రం చెబుతోంది.ఓ ముఖ్యమంత్రి జైలుకు వెళితే.. పరిపాలన అంతా కుంటుపడుతుంది. సీఎం జైలులో ఉంటే కేబినెట్ సమావేశాలు జరగవు. ఫైళ్లు ముందుకెళ్లవు. శాసన వ్యవహారాల్లో పాల్గొనలేరు.ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మంత్రివర్గం సమిష్టిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇలా నిర్బంధంలో ఉన్న వారు చేసే పనులు రాజ్యాంగ పరంగా నైతికమేనా అన్న ప్రశ్న తలెత్తుతుంది.తీవ్రమైన నేరాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే వారు అత్యున్నత పదవుల్లో కొనసాగితే.. అవన్నీ సాధారణం అనే భావన పెరిగిపోతుంది. ఇంతటి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వ్యవస్థలను నడిపిస్తుంటే ప్రజల్లో ఆ సంస్థల పట్ల విశ్వాసం దెబ్బతిం టుంది.ఇప్పుడు ప్రతిపాదించిన బిల్లు చట్టరూపంలోకి వస్తే..నెల రోజులకు మించి కళంకితులు పదవుల్లో ఉండే అవకాశం లేదు. దీనిని రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు.. ప్రధానిని కూడా దీని పరిధిలోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది. రాజ్యంగంలోని ఆర్టికల్ 75 ప్రధాని నియామకం, మంత్రిమండలి గురించి చెబుతుంది. మంత్రిమండలిలో అనర్హతపై చర్చించే ఆర్టికల్ 75, క్లాజ్ 5కు ఇప్పుడు సవరణ ప్రతిపాదించారు. దీని ప్రకారం క్లాజ్ 5ం చేరుస్తారు. ప్రతిపాదిత బిల్లులో కేంద్రమంత్రి వర్గంలోని సభ్యుడు నేరారోపణల కారణంగా ఐదు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే నేరంలో నెలరోజుల పాటు కస్టడీలో ఉంటే... ప్రధాని సిఫారసుతో అతన్ని 31 వరోజు రాష్ట్రపతి తొలగించాలి.ఇదే పరిణామాలతో ప్రధానమంత్రి ఐదేళ్ల పైబడి శిక్ష పడే నేరారోణపణలు ఎదుర్కొంటూ.. 30 రోజులకు పైబడి కస్టడీలో ఉన్నట్లైతే.. ఆయన స్వయంగా రాజీనామా చేయాలి.

లేనిపక్షంలో 31వరోజు నుంచే ప్రధాని పదవి ఉండదు.ఆర్టికల్ 164 లోని ముఖ్యమంత్రి నియామకానికి సంబంధించి 4వ క్లాజ్‌కు అదనంగా 4ం జతపరుస్తారు. దీని ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసుతో గవర్నర్ 31వ రోజు తొలగిస్తారు. అలాగే ఈ విధమైన ఆరోపణలు ఎదుర్కొనే ముఖ్యమంత్రి నెలరోజులలోపు రాజీనామా చేయకపోతే.. 31వ రోజు నుంచి సీఎంగా పరిగణించరు.ఇదే పద్ధతిలో ఆర్టికల్ 239ంంలో 5వ క్లాజ్ ను సవరించి ఢిల్లీ ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులకు ఇదే వర్తింపచేస్తారుచూడటానికి నైతిక స్ఫూర్తితో .. పాలనా వ్యవస్థలను సంస్కరించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణగా ఇది కనబడుతున్నా..

దీనిపై పెద్ద రాజకీయం ఉందని ప్రతిపక్షాలు అంటున్నాయి. అందుకే వాళ్లు ఆ స్థాయిలో దీనిని వ్యతిరేకించారు. ప్రతిపక్షాల గొడవకు పార్లమెంట్‌లోకి మార్షల్స్ రావలసి వచ్చింది. బిల్లును చించి... హోంమంత్రిపైకి కూడా విసిరారు. ఇంత తీవ్రంగా వాళ్లు వ్యతిరేకించడానికి కారణం కూడా ఉంది.ఇది ప్రతిపక్షాలను అణగదొక్కే ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లు అని ఆ పార్టీలు అంటున్నాయి. అధికార పక్షం ఏదైనా రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాకపోతే.. ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని సీఎంలను మార్చేస్తారు.అరెస్టు అయిన వారు నేరస్తులు కాదు. నేరం నిరూపితం అయ్యే వరకూ నిందితులు అంతా నిర్దోషులే. 30రోజుల్లో ఆటోమేటిక్‌గా పదవి నుంచి తొలగించడం అంటే నేరం చేయకుండానే శిక్ష విధించడంకేం ద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ పేట్రేగిపోతాయి. ఇప్పటికే.. వాటిని రాజకీయాల కోసం వాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ చట్టం వస్తే.. అది మరో రాజకీయ అస్త్రం అవుతుంది.ప్రభుత్వాలను అస్థిర పరచడం కోసం.. ఈ ఏజన్సీల ద్వారా అరెస్టులు చేసి రిమాం డ్‌కు పంపుతారు. ఈలోగా ప్రభుత్వాలను మార్చేస్తారు

# ఓ వైపు ఆకలి చావులు.. మరోవైపు





**- బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న పాలస్తీనియన్లు**
**- కొనసాగుతున్న ఇజ్రాయిల్ మారణకాండ**

గాజాస్ట్రిప్ : ఓవైపు ఆకలి చావులు.. మరోవైపు భీకర దాడులు. గాజా స్ట్రిప్‌లో అనునిత్యం కన్పిస్తున్న దృశ్యాలివి. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఆకలిలో విలవిలలాడిపోతుంటే మరోవైపు ఇజ్రాయిల్ సైనికులు ఏ మాత్రం కనికరం చూపకుండా అమానుషంగా దాడులు చేస్తూనే ఉన్నారు. సహాయ పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన అన్నార్తులు, సామాన్య ప్రజలను కూడా వదలడం లేదు. గాజాను బలవంతంగా ఖాళీ చేయించడమే ఇజ్రాయిల్ ఉద్దేశం. అదే జరిగితే పది లక్షల మంది నిరాశ్రయులవుతారు. వేలాదిమంది ప్రజలు ఇప్పటికే ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. నగర శివారులో జనసమ్మర్దం అధికంగా ఉండే సబ్రా, తుఫా వంటి ప్రాంతాలు బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. గాజా నగరంలో సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని సైతం బహిష్కరించాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోంది. 2023 అక్టోబరులో ఇజ్రాయిల్ దాడులు మొదలైనప్పటి నుంచి నేటి వరకూ ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 62,686కు చేరింది. 1,57,951 మంది గాయాల పాలయ్యారు. గత నెల రోజులుగా ఇజ్రాయిల్ ముమ్మరంగా దాడులు చేస్తోంది. మృతులు, క్షతగాత్రుల్లో అత్యధికులు చిన్నారులు, మహిళలేనని స్వచ్ఛంధ సంస్థలు అంచనా వేస్తున్నాయి. నెట్‌జారిమ్ కారిడర్ ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడుల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పో యారు. గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్) నిర్వహిస్తున్న సహాయ పంపిణీ కేంద్రం వద్ద వేచిచూస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరిపిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

గాజా ప్రజలకు కాళరాత్రులే: గాజా ప్రజలు భయంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం దాడులతో నిరంతరాయంగా పేలుడు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. గాయాల పాలైన వారితో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. పేలుళ్ల ధాటికి గాలిలో దట్టమైన పొగ వ్యాపిస్తోంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలా మంది ఊపిరి అందక బాధపడుతున్నారు.

ఆకలికి తాళలేక ఇప్పటి వరకూ 289 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా స్ట్రిప్‌లోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునిర్ అల్-బర్ష్ తెలిపారు. వీరిలో 115 మంది చిన్నారులే. గత 24 గంటల్లో 64 మృతదేహాలను ఆస్పత్రులకు తీసుకొచ్చారు. అనా రోగ్యాల బారిన పడిన వారికి వైద్య సేవలు కూడా అందడం లేదు. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు కూడా ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. నవజాత శిశువులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్న చిన్నారులు: గర్భిణులకు అవసరమైన పోషకాహారం లభించకపోవడంతో వారికి పుట్టిన పిల్లలు కూడా అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఆకలికి తాళలేక చిన్నా రులు కళ్ల ఎదుటే ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు ఉండిపోతున్నారు. నగరంలోని సహాయ గిడ్డంగులు ఖాళీగా దర్శనమిస్తున్నా యి. ఇజ్రాయిల్ ఆంక్షల కారణంగా ఆహారం, మందులు, ఇతర అత్యవసర సామగ్రి సరఫరాలు నిలిచిపోయాయి.

వివిధ దేశాల్లో నిరసనలు: గాజా నగరంలో ఇజ్రాయిల్ సృష్టించిన క్షామాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. గాజాలో మారణహోమాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలోని 20 నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్రిస్బేన్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది ప్రజలు గాజాలోని అన్నార్తులకు తక్షణమే సాయం అందించాలని, కాల్పుల విరమణ ప్రకటించాలని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్‌లో కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. యుద్ధాన్ని ఆపాలంటూ టెల్ అవీవ్‌లో వేలాదిమంది ర్యాలీ తీశారు.అనేక యూరోపియన్ నగరాలలో కూడా ఇజ్రాయిల్ చర్యలను నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

## విశాఖ చుట్టూ టౌన్ షిప్స్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**ప్రభుత్వం సరికొత్త ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నగరీకరణ పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు మరింతగా విస్తరించాలని భావిస్తోంది. నగరాల చుట్టూ కొత్తగా థీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్ షిప్ లు, సిటీస్ నిర్మించాలన్న ఆలోచన చేస్తోంది. నగర జనాభా పెరుగుతున్న దృష్ట్యా.. వారి అవసరాలకు అనుగుణంగా ముందే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇప్పటికే నీతి ఆయోగ్ విశాఖను ప్రత్యేక గ్రోత్ సిటీగా గుర్తించింది. నగరానికి అనుసంధానంగా పట్టణాలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దాదాపు 1000 ఎకరాల్లో భూమిని సేకరించనుంది. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేయనున్నారు.విశాఖ నగరం చుట్టూ కొత్త తరహా పట్టణాలు రాబోతున్నాయి. అనకాపల్లి తో పాటు విజయనగరం ప్రాంతాల్లో థీం బేస్డ్ పట్టణాలను, సిటీలను, టౌన్ షిప్ లను అభివృద్ధి చేయనున్నారు. ఐటి, వైద్యం, పర్యాటక రంగం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆశ్రయిస్తారు. ప్రస్తుతం విశాఖ జనాభా 21 లక్షలకు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. విశాఖ పరిసర ప్రాంతాల్లో.. విజయనగరం తోపాటు అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. అక్కడ దాదాపు1000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించారు. భూ సమీకరణ పథకం ద్వారా ప్రైవేటుభూములను సమీకరిస్తారు. భూమియజమానులకు నష్టపరి హారం అందిస్తారు. అయితే ఇలా గుర్తించిన భూముల్లో ఐటి,పర్యాట కం,వైద్యం,వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తారు. ప్రైవేటు సంస్థలు పెట్టుబ డులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికులకు సైతం ఉద్యోగాలులభిస్తాయి. ఎప్పటికీ నీతి ఆయోగ్ సిఫార్సులలో విశాఖ కుచోటు దక్కింది. గ్రోత్ సిటీగా గుర్తింపు సాధించింది.అయితే ఇటువంటి నగరాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కోట్లు కేటాయించింది. దీని ద్వారా థీమ్ ఆధారిత నగర నిర్మాణాలు సులువు అవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఆగని ఎమ్మెల్యేల తప్పిదాలు?

అనంతపురం,తెలంగాణ దిశ :కూటమి ప్రభుత్వం ఏర్పాట యిన తర్వాత ఏడాదిలోనే అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వ పరంగా కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల కాదు. కేవలం ఎమ్మెల్యేల వల్లనే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ ఎమ్మెల్యేలో చాలా మంది పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారు. లెక్కలేని తనం వారిలో కనిపిస్తుంది. నియోజకవర్గానికి తామే బాస్ లుగా వ్యవహరిస్తున్నారు. తాము ఎన్నికయింది ఎవరి వల్లనన్నది గుర్తించని పరిస్థితుల్లోకి కొందరు ఎమ్మెల్యేలు వచ్చేశారు. అందుకే టీడీపీ నాయకత్వానికి ఈ ఎమ్మెల్యేలతో ఇబ్బందికరంగా మారింది. నిజానికి చెప్పాలంటే చంద్రబాబు నాయుడు గత మూడు దఫాలు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తలెత్తని వివాదాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి నాడు ఎమ్మెల్యేలు ఒక పద్ధతిని పాటించేవారు. నియోజకవర్గాల్లో ఎలాంటి అవినీతి పనులకు, అక్రమాలకు వేలు పెట్టేవారు కాదు. అవసరమనుకుంటే స్థానిక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసి వారి మన్ననలను పొందేవారు. కాకుంటే బయట ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడంతో పాటు ఏదో ఒక పెద్ద పైరవీని చేసుకుని తాము ఎన్నికల్లో ఖర్చు పెట్టుకున్న మొత్తాన్ని తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసేవారు. అప్పట్లో ఇవేమీ బయటకు వచ్చేవి కావు. కానీ ఇప్పుడు ఇలా కాదు. నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు దుకాణాలు తెరిచారు. ఇసుక, మద్యం ఏ విషయంలోనూ వేలు పెట్టకుండా ఉండలేకపోతున్నారు. నియోజకవర్గం ప్రజల వద్దనే చేతులు కూడా చాచేవారు కూడా లేకపోలేదు. దీనికి తోడు హంగామా, అనుచరుల ముందు ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికి చేస్తున్న వీరంగం చేస్తున్నారు. వీరిని కంట్రోల్ చేయడం నాయకత్వానికి కూడా సాధ్యం కాదు. అలవాటు పడిన ప్రాణం ఊరికే ఉండదు.అందుకే ఎమ్మెల్యేలు చేసిన తప్పులను ఒక్కొక్కటిగా నాయకత్వం లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు.పార్టీ నుంచి సస్పెండ్ చేసుకుంటూ పోతే చాలా మందిని చేయాల్సి వస్తుంది.అందుకే వార్నింగ్‌లతో సరిపెడుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్నఎమ్మె ల్యేల్లో చాలా మందికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. మొన్నటి ఎన్నికల్లోనే చంద్రబాబు సీనియర్ నేతలను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారు. ఈసారి ఇప్పుడు వివాదాల్లో చిక్కుకుంటున్న వారికి మాత్రం నో టిక్కెట్ అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. కార్యకర్తల అభిప్రాయం కూడా ఇలాగే ఉండటంతో నాలుగేళ్లు వీరు ఏం చేసినా వార్నింగ్ లతో సరిపెట్టాల్సిందే. అంతే తప్ప చర్యలుండవు. అసలు చర్యలు ఎన్నికల్లోనే.

## పార్థివ దేహానికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు

కమాన్ పూర్: ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు జంగేటి రాములు పార్థివదేహాన్ని నివాళులర్పించారు. ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో ఐకెపి బుక్ కీపర్ జంగిటి తిరుపతి వాళ్ల తండ్రి,కాంగ్రెస్ నాయకులు మాజీ వార్డు సభ్యులు జంగిటి రాములు మృతి చెందగా వారి పార్థివదేహానికి ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్యలు పూలమాల వేసి ఘన నివాళులుఅర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలపడంజరిగింది.ఈ కార్యక్రమంలో వారి వెంట పోతారం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్ర మల్లయ్య,మాజీ ఎంపీటీసీలు బండ సమ్మయ్య,నెత్తెట్ల భారత లక్ష్మి కొమురయ్య,కాంగ్రెస్ నాయకులు చెల్కల ఓదెలు,కోటగిరి శ్రీశైలం,నర్ర రాజేష్,చెల్కల నరేందర్,కిషన్,నెత్తెట్ల శ్రావణ్,రమేష్,ఇట్టం గట్టయ్య, బత్తుల మల్లయ్య తదితర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు



## పూరీ క్షేత్రం పేరిట నకిలీ వెబ్‌సైట్ దోపిడీ!



పూరీ: ఒడిశాలోని ప్రముఖ పూరీ జగన్నాథ ఆలయంలో ఆన్‌లైన్ పూజల పేరిట భక్తులను మోసం చేస్తున్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను పోలీసులు గుర్తించారు. శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు, దర్శనం, నైవేద్య సమర్పణ తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలతో ఆ వెబ్‌సైట్ రూ.వేలల్లో దోపిడికి పాల్పడుతోందని పూరీ ఎస్పీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో.. సైబర్ బృందాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌నుబ్లాక్ చేసి, కేసుదర్యాప్తునకు చర్యలుతీసుకుంటున్నట్లు చెప్పారు."జగన్నాథుని దర్శనం, ప్రత్యేక పూజలు తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇచ్చే నకిలీ వెబ్‌సైట్‌లకు భక్తులు దూరంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. ఆలయ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఛానెల్ల ద్వారా సేవలను ధ్రువీకరించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో హోటళ్లను బుక్ చేసుకునే సమయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం.

## పాఠశాలల్లో క్రీడా పండుగ.. క్రీడాజ్యోతితో పరుగులు తీసిన మంత్రి

**మక్తల్,తెలంగాణ దిశ :** కుని డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలోఉదయం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు 2 కే రన్లో క్రీడాజ్యోతిని చేత పట్టుకుని మంత్రి వాకిటి శ్రీహరి విద్యార్థులతో పాటు పరిగెత్తారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పాలసీ ప్రకటించిన నేపథ్యంలో 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు వచ్చిన ఆదేశాల ప్రకారం డీఈవోల ఆధ్వర్యంలో ఎసీఎఫ్ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల నిర్వహణకు సమాయత్తమయ్యారు. మొదటగా నెల చివరి వరకు మండల స్థాయి వరకు ఖోఖో, కబడ్డీ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించను న్నారు. తర్వాత బాస్కెట్బాల్, అథ్లె టిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్బాల్, హ్యాండ్బాల్, హాకీ, క్రి కెట్, సాఫ్ట్బాల్, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, నెట్బాల్, రగ్బీ, చెస్, తైక్వాండో, కరాటే, జూడో క్రీడా అంశాల్లో, సెప్టెంబర్ రెండో వారంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిం చనున్నారు. ఆయా క్రీడా అంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కళాశాల స్థాయిలో ఎసీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రీడా ఎంపికలు సెప్టెంబర్లో నిర్వహిస్తారని ఆయన అన్నారు. వారికి భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోటా దక్కనుందన్నారు. అందుకు ప్రతి విద్యార్థిలో క్రీడా స్ఫూర్తి రావాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బదిలీల్లో కులం రంగులు..?

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :**శ్రీకాకుళం జిల్లాలో వివాదాస్పదమైన ఓ కేజీబీవీ ప్రిన్సిపాల్ బదిలీ కొత్త మలుపు తిరిగింది. జిల్లాలో ఎప్పటి నుంచి నలుగుతున్న కళింగ వర్సెస్ వెలమ మరోసారి తెరపైకి వచ్చింది. ఈ బదిలీ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ శ్రీనివాస్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. కళింగ నాయకులను తొక్కేస్తున్నారని ఆరోపించారు. ఇది జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం ప్రశాంతతకు మారు పేరు. అక్కడ రాజకీయం కూడా అంతే కూల్‌గా ఉంటుంది. వివాదాలు పెద్దగా ఉండవు. కానీ ఈ మధ్య కాలంలో అమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. లోలుగు కేజీబీవీలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీ ఆయన మెడకు చుట్టుకుంది. ఆమెను కంచిలి కేజీబీవీకి బదిలీ చేయడంతో వివాదం రాజుకుంది. తనపై కక్ష పూరితంగా ఎమ్మెల్యే సిఫార్సుతోనే తనను బదిలీ చేశారని ప్రిన్సిపాల్ సౌమ్య ఆరోపించారు. అంతే కాకుండా ఆమె ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. సౌమ్య ఆత్మహత్యాయత్నంతో వివాదం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ దీన్ని తమకు అనుకూలంగా మార్చుకొని కూన రవికుమార్‌ను టార్గెట్ చేసింది. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విచ్చలవిడిగా ఉద్యోగులపై కక్షసాధింపులకు దిగుతున్నారని వైసీపీ అనుకూల మీడియా స్టోరీలు ప్రచురించింది. ఇప్పటి వరకు రాజకీయాల్లో యాక్టివ్‌గా లేని ధర్మాన కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారు.కట్ చేస్తే సీన్‌లోకి వైసీపీ బహిష్కృత నేత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వచ్చారు. కూన రవికుమార్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని అలాంటి బదిలీల్లో వెళ్లేందుకు సిద్ధంగా ఉండే ఎవరైనా ఉద్యోగాల్లో చేరుతారని చెప్పుకొచ్చారు. కానీ సౌమ్య విషయంలో రాద్ధాంతం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని చెప్పుకొచ్చారు.అటు కింజరాపు, ఇటు ధర్మాన ఫ్యామిలీపై దువ్వాడ శ్రీనివాస్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు."జిల్లాలో వారం రోజులుగా ఒక ట్రాన్స్‌ఫర్ చర్చనీయాంశంగా మారింది. ఒక ట్రాన్స్‌ఫర్ కోసం ఇంత రచ్చ జరగడం ఎప్పుడూ చూడలేదు. కలెక్టర్ చేసిన ట్రాన్స్‌ఫర్‌పై ఎందుకు రచ్చ జరుగుతోంది. ట్రాన్స్‌ఫర్ సహజమే కదా. మరి ఇది ఎందుకు పొలిటికల్ వార్‌లా మారింది. కులాల ప్రస్తావన ఎందుకు వచ్చింది. దాడులు ఎందుకు జరుగుతున్నాయి? తటస్థ ఎమ్మెల్సీగా పరిశీలిస్తే చాలా విషయాలు వెలుగు చూశాయి. జిల్లావ్యాప్తంగా ఒక కులంపై దాడులు జరుగుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అటెండర్ నుంచి ఆర్టీవో వరకు ఒక కులం వాళ్లే ఉన్నారు. అది మంత్రి కులానికి చెందిన వారు. మిగతా కులాలపై వేధింపులు సర్వసాధారణమైపో యాయి. నియంతృత్వపాలన సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. " అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళింగ కులానికి చెందిన నాయకులు ఎదుగుదల చూడలే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు దువ్వాడ శ్రీనివాస్. మంత్రి అచ్చెన్న చెప్పిన వెంటనే కృష్ణదాసు సౌమ్యను పరామర్శించారని ఆరోపించారు. అచెన్న బాధితుడైన అధికారిని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నిం చారు. ఆయన ఏమన్నారంటే" మంత్రి అచ్చెన్న నిర్వాకం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనిముట్లు ఇచ్చే కంపెనీలతో డైరెక్ట్ మీటింగ్ పెట్టమని పేషీలో ఉన్న రాజమోహన్‌పై ఒత్తిడి తెచ్చారు. అది ఆయన చేయలేక ఒత్తిడి భరించలేక లెటర్ సెలవుపై వెళ్లిపోయారు. దీనిపై కృష్ణదాస్ ఏం చేస్తున్నారు. ఆయన్ని ఎందుకు పరామర్శించలేదు. అచ్చెన్న చెప్పాడని సౌమ్యను పరామర్శించారు. రాజమోహన్ అనుభవించింది మానసిక ఒత్తిడి కాదా... మంత్రి అచ్చెన్నపై విమర్శలు చేయరా. ఎందుకు ఒకే కులాన్ని టార్గెట్ చేస్తున్నారు." కులాన్ని టార్గెట్ చేస్తున్నారని తమ బుర్రల్లోకి వెళ్తే మాత్రం గేమ్ స్టార్ట్ చేస్తామని ధర్మాన, అచ్చెన్నకు వార్నింగ్ ఇచ్చారు దువ్వాడ. "ఎవడిపై రౌడీయిజం చేయాలని అనుకుంటున్నారు. ఇదే జరిగితే అది మా బుర్రల్లోకి ఎక్కింది అంటే మాత్రం కచ్చితంగా ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, అచ్చెన్నకు వార్నింగ్ ఇస్తున్నాను. మేం గేమ్ స్టార్ట్ చేస్తాం. మరో ఉద్యమం ప్రారంభమవుతుంది. జాతికి నష్టం జరుగుతుంటే కచ్చితంగా నేను నిలబడతాను. ఆ జాతితోపాటు మిగతా కులాలను అన్నింటినీ ఏకం చేస్తాం. ప్రాణత్యాగాలు చేయడానికైనా సిద్ధం. కొందరు చీడపురుగులను వాడుకొని కులంలో చిచ్చు రేపాలని చూస్తారు. వారిని కూడా టార్గెట్ చేస్తాం. కళింగ జాగృతి కోసం ముందడుగు వేస్తాం. కళింగ కులస్తుడిని కాబట్టే వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు దువ్వాడ. తాను ఉన్నన్ని రోజులు వారికి మునుగడ ఉండదనే ఈ చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అయినా తాను వెనక్కి తగ్గబోనని అన్నారు. "నేను కళింగ కులానికి చెందిన వాడినని సస్పెండ్ చేశారు. స్పీడ్‌గా ఉంటానని సస్పెండ్ చేశారు. నేను ఉంటే వారి ఉనికి ఉండదని సస్పెండ్ చేశారు. నన్ను ఎదుర్కొని దమ్ము లేక సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేస్తే హైదరాబాద్ వెళ్లి బట్టలు మడత పెట్టుకుంటానని అనుకున్నారు. కానీ రాజకీయాలలో మడతేయడానికి వచ్చాను. కులాన్ని వాడుకోవాలనుకుంటే ఎప్పుడో వాడుకునే వాడిని. ఇప్పుడు మాత్రం అన్ని కులాలను వాడుకుంటాను. అన్ని కులాలకు నాయకత్వం వహిస్తాను. కళింగ కులానికి అన్యాయం జరగడంతో ఇతర కులాలు కూడా నష్టపోతున్నాయి. అన్ని కులాలకు బాసటా ఉంటూ ముందు ఉండి నడిపిస్తాం. " అని అన్నారు.

# సినిమా..

## 95 శాతం ఒరిజినల్.. చిరంజీవి సినిమాపై హైప్ పెంచేస్తున్న అనిల్ రావిపూడి



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మన శంకర ప్రసాద్‌గారు సినిమాతో అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ సినిమాలో వినోదం ఏ రేంజ్‌లో ఉండబోతుందో ఫస్ట్ గ్లింప్స్‌తోనే హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. కాగా గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. సాధారణంగా సీనియర్ హీరోలను సిల్వర్ స్క్రీన్‌పై స్లిమ్‌గా చూపించేందుకు కొన్ని సందర్భాల్లో వీఎఫ్ఎక్స్ వాడుతుంటారని తెలిసిందే. ఈ సినిమాలో మాత్రం అలాంటిదేమి వినియోగించలేదు. మన శంకర ప్రసాద్‌గారు గ్లింప్స్‌లో మీరు చూస్తున్న చిరంజీవి విజువల్స్ 95 శాతం ఒరిజినల్‌వేనని.. చిరంజీవి సార్ ఇలా స్లిమ్, సూపర్ యాక్టివ్‌గా కనిపించేందుకు చాలా కష్టపడ్డారని చెప్పుకొచ్చాడు అనిల్ రావిపూడి. చిరంజీవిని సూట్ లాంటి క్లాసీ దుస్తుల్లో ఉండటమంటే తనకు చాలా ఇష్టమన్నాడు అనిల్ రావిపూడి. ఇది కేవలం శాంపిల్ మాత్రమే..

మీ అందరికీ ఇంకా స్టఫ్ రెడీ అవుతోంది. తాజా లుక్ విషయంలో క్రెడిట్ కేవలం చిరంజీవికే ఇస్తానన్నాడు అనిల్ రావిపూడి. ఈచిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల–విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కి స్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్,బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తునాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండ గా.. విడుదల తేదీపై క్లారిటరావాల్సిఉంది. చిరంజీవి బింబిసార ఫేంమల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో నటిస్తోన్న విశ్వంభర షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాలో త్రిష ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

## సమంతతో 200 కోట్ల ఎక్స్ పెరిమెంట్..?

సౌత్‌స్టార్ హీరోయిన్ సమంత ఈమధ్యనే తన 1ఏళ్ల సినీ వసంతాలను పూర్తి చేసుకుంది. ఇన్నేళ్ల జర్నీలో సమంత ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. ఇలా వచ్చి అలా కనుమరుగయ్యే హీరోయిన్స్ ఉన్న ఈ టైం లో ఏమాయ చేసావే సినిమాతో పరిచయమై తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకుంది అమ్మడు. కెరీర్ లో స్టార్ క్రేజ్ ని త్వరగానే అందుకుంది సమంత. తొలి సినిమా హిట్ ఆ తర్వాత రాజమౌళి దృష్టిలో పడి ఈగ ఛాన్స్ రావడం. అది కూడా సూపర్ హిట్ అవ్వడం మహేష్, ఎన్ టీ ఆర్ ఇలా స్టార్స్ తో నటించడంతో అమ్మడి రేంజ్ మరింత పెరిగింది. కెరీర్ లో కొంత బ్యాడ్ టైం.. తెలుగులో స్టార్ అయిన సమంత అటు తమిళ్ లో కూడా అదే రేంజ్ ఫాం కొనసాగించింది. అక్కడ కూడా స్టార్స్ తో కలిసి జత కట్టి సత్తా చాటింది సమంత. ఐతే ప్రతి హీరోయిన్ కి కెరీర్ లో కొంత బ్యాడ్ టైం నడుస్తుంది. ఆ టైం ని కూడా చాలా సమర్ధవంతంగా ఫేస్ చేసింది సమంత. ఇక పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్ లో ఇబ్బందులు ఆమెను మరింత వెనక్కి నెట్టాయి. మయోసైటిస్ వల్ల సమంత దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. తెలుగులో విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేసిన సమంత ఆ తర్వాత మరో సినిమాకు సైన్ చేయలేదు. ఐతే ఆఫ్టర్ లాంగ్ టైం సమంత శుభం సినిమాలో క్యామియో రోల్ చేసింది. ఐతే అది కూడా తన సొంత ప్రొడక్షన్ లో సినిమా కాబట్టే ఆ మూవీలో నటించింది. సమంత ఎప్పుడు వెనకపడ్డా కూడా దానికి డబుల్ ఫోర్స్ తో మళ్లీ ముందుకొస్తుంది. సమంత లీడ్ రోల్ లో రక్త్ బ్రహ్మండ్.. ఈమధ్యనే సిటాడెల్ సీరీస్ తో బాలీవుడ్ ఆడియన్స్ ని అలరించిన సమంత. నెక్స్ట్ రాజ్ అండ్ డీకే చేస్తున్న 200 కోట్ల ప్రాజెక్ట్ లో నటిస్తుందని తెలుస్తుంది. రాజ్ అండ్ డీకే తో సమంత కాంబినేషన్ లో ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ సీరీస్ లు వచ్చాయి. ఈ క్రమంలోనే ఆ దర్శక ద్వయం నెక్స్ట్ రక్త్ బ్రహ్మండ్ అంటూ ఒక సీరీస్ ని చేస్తున్నారు. నెట్ ఫ్లిక్స్ నిర్మిస్తున్న ఈ వెబ్ సీరీస్ 200కోట్ల బడ్జెట్ తో భారీగా ఉండబోతుందట. ఇందులో సమంత లీడ్ రోల్ లో నటిస్తుంది. సమంతతో



అంతబడ్జెట్‌తో సీరీస్ అంటే రిస్క్ అనే చెప్పొచ్చు. కానీ సబ్జెక్ట్ మీద ఉన్నకాన్ ఫిడెన్స్ తో ముందుకెళ్తున్నారట. త్వరలోనే ఈ సీరీస్ కు సంబందించిన అప్డేట్ బయటకు వస్తుంది.

## ఇకపై సింగిల్ గానే..!

సీనియర్ నటి మనీషా కోయిరాలా జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగారు. బాలీవుడ్ సినిమాల్లో తనదైన ముద్ర వేసిన నటి. ఒకే ఒక్కడు, క్రిమినల్‌లాంటి చిత్రాలతో తెలుగు లోనూ అంతే ఫేమస్ అయ్యారు. ఇలా సంచలనమైన మనీషా జీవితం ఒక్క సారిగా కుదుపులకు లోనైంది. మహమ్మారి క్యాన్సర్ బారిన పడటం తిరిగి కోలుకోవడం తెలిసిందే. వ్యక్తిగత జీవితంలోనూ మనీషా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. నటిగా ఫాంలో ఉన్న సమయంలో రిలేషన్స్ షిప్స్ విషయం లోనూ మనీషా పేరు అంతే హైలైట్ అయింది. నానా పటేకర్ తో కలిసి అగ్ని సాక్షి సినిమా చేస్తోన్న సమయంలో అతడితో ప్రేమలో పడిందన్నది ఓ సంచలనం. దీంతో పెళ్లైన నానా పటేకర్ తో ప్రేమాయణం ఏంటని తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. అటుపై సౌదాగర్ సినిమాలో నటించిన వివేక్ ముష్రాన్ తోనూ సంబంధం ఉందని ప్రచారం జరిగింది. వాళ్లిద్దరి అనంతరం మార్కెట్ సినిమా సమయంలో ఆర్యన్ వేద్ తోనూ రిలేషన్ షిప్ లో ఉందని అప్పటి బాలీ వుడ్ మీడియా కోడై కూసింది. హుస్సేన్ బాబాయ్ గా పేరొందిన డీజే హుస్సేన్, నేపాల్ లోని ఆస్ట్రేలియా అంబా సిడర్ క్రిస్పిన్ కొనరాయ్, లండన్ వ్యాపారి సిసిల్ అంథోనీ, అమెరికన్ స్పోర్ట్స్ కౌన్సిలర్ క్రిస్టోఫర్ డోరిస్ లాంటి పేర్లు నేపాలీ బ్యూటీ ప్రయాణంలో తెరపైకి వచ్చిన పేర్లు. ఇవన్నీ ముగిసిన అనంతరం 2010 లో సామ్రాట్ దహాయ్ తో వివాహం అంతే సంచలనం. ఆ బంధం కూడా ఎంతో కాలం నిలువ లేదు. పెళ్లైన రెండేళ్లకే విడిపోయారు. అటుపై క్యాన్సర్ బారిన పడటం తిరిగి కోలుకోవడం తెలిసిందే. ఈ మొత్తం ప్రయాణంలో సరైన జీవితం కానిది ఏది?అంటే రిలేషన్ షిప్స్ లో ఉన్నది గానే మనీషా కోయి రాలా పేర్కొంది. రిలేషన్ షిప్స్ కారణంగా చాలా సమయం వృద్ధా చేసుకు న్నానని తెలిపింది. వ్యక్తిగత...వృత్తిగత జీవితాలపై ఆ



ప్రభావం పడిందన్నారు. ప్రస్తుతం సింగిల్‌గా ఉన్నా నని..ఇదే ఎంతో సంతోషంగా ఉందన్నారు. అప్పుడప్పుడు ఒంటరి అన్న భావన కలిగినా? ఆ ఆలోచన నుంచి బయటకు వస్తే ఇదే ఉత్తమమైన జీవితంగా పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరి జీవితంలో ఓ బ్యాడ్ ఫేజ్ ఉంటుందని...తన జీవితంలో రిలేషన్ షిప్స్ సహా అనారోగ్య కారణాలుగా తల్లికిం దులైందని తెలిపారు.

## లవ్ స్టోరీలో బాలయ్య..!



మనటాలీవుడ్‌లో మాస్ సినిమాలు తీయాలంటే నందమూరి బాలకృష్ణతర్వాతే ఎవరైనా.కేవలం మాస్ సినిమాలు మాత్రమే కాదు, పౌరాణికం, జానపదం వంటి జానర్స్ కి కేర్ ఆఫ్ అడ్రస్ ఆయన. ఫ్యామిలీ స్టోరీస్ ఇప్పట్లో తియ్యడం లేదు కానీ,పాత రోజుల్లో ఫా మిలీ డ్రామాస్‌తో కూడా భారీ బ్లాక్ బస్టర్ హిట్స్ ని కొట్టిన చరిత్ర ఆయనది. అలా అన్ని జానర్స్ లో మెప్పించిన బాలయ్య లవ్ స్టోరీ జానర్ లో మాత్రం ఇప్పటి వరకు నటించలేదు. అదే విధంగా కామెడీ జానర్ లో కూడా ఆయన ఇది వరకు సినిమాలు చేయలేదు. అసలు బాలయ్య తో ఈజానర్స్ లో సినిమాలు తీయా లనే ఆలోచన ఎవరికీ రాదేమో. ఎందుకంటే ఆయనకీ ఉన్న మాస్ ఇమేజ్ అలాం టిది. అయితే బాలయ్య ఎలాంటి జానర్‌లో అయినా అద్భుతంగా నటించగల డు అని అనేక అందర్భాల్లో రుజువు అయ్యింది.

## తళుకు బెలుకుల అందాలతో కట్టిపడేస్తున్న నిధి అగర్వాల్



తెలుగు ,తమిళ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ సంపాదించుకున్న హీరోయిన్ లలో నిధి అగర్వాల్ కూడా ఒకరు. ఈ అమ్మడు 2017లో వచ్చిన 'మున్నా మైకేల్' అనే చిత్రం ద్వారా బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2018లో 'సవ్యసాచి' అనే చిత్రంతో నాగచైతన్యకు జోడిగా నటించి తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో హీరోయిన్ గా భారీ పాపులారిటీ అందుకున్నది. 2021లో తమిళ సినిమా ఈశ్వరన్ తో ఎంట్రీ ఇచ్చిన నిధి అగర్వాల్.. ఆ తర్వాత ఎన్నో చిత్రాలలో నటించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ తో హరిహర వీరమల్లు సినిమాలో కూడా నటించింది. అలా వరుస సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో కూడా అంతే యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. నిరంతరం అభిమానులను ఖుషీ చేసేలా తన అందచందాలతో ఆకట్టుకుంటూ ఉంటుంది. తన సినిమా అప్డేట్లనే కాకుండా తనకు సంబంధించిన ఎలాంటి విషయాన్నైనా తెలియజేస్తూ ఉంటుంది నిధి అగర్వాల్. ఇప్పుడు తాజాగా ఈ ముద్దుగుమ్మ క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సీతాకోకచిలుక సింబల్ ను జోడించింది. ఈ ఫొటోస్ చూసిన అభిమానులు నిధి అగర్వాల్ చాలా క్యూట్ గా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒక్కో ఫోటోలో ఒక్కో యాంగిల్ లో ఫోజులిచ్చి న నిధి అగర్వాల్.. మిర్రర్ పొదిగిన డ్రెస్ ధరించి.. తళుకు బెలుకుల అందాలలో పాక్షికంగా ఎద అందాలు చూపిస్తూ రెచ్చగొట్టింది.. చిన్నటి స్మైల్ తో ఈ ఫోటోలకు మరింత అందాన్ని జోడించండి. నిధి అగర్వాల్ షేర్ చేసిన కొన్ని సెకండ్లలోనే ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ప్రస్తుతం ఈమె నటిస్తున్న సినిమాల విషయానికి వస్తే.. ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ చిత్రంలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఈమెతోపాటు మాళవిక మోహనన్, రిద్దీ కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.

## హద్దులు చెరిపేస్తున్న తమన్నా...



మిల్కీ బ్యూటీగా దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటి తమన్నా భాటియా, ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన అడుగు వేయబోతున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో హారర్ మరియు బోల్డ్ కంటెంట్‌తో సంచలనం సృష్టించిన 'రాగిణి MMS ఫ్రాంచైజీలో ఆమె నటించబోతోందన్న వార్త ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రంలో తమన్నానే కథానాయిక అని గట్టిగా ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం నిర్మాత ఏక్తా కపూర్ స్వయంగా తమన్నాతో చర్చలు జరిపారు. ఈ ప్రతిపాదనకు తమన్నా కూడా సానుకూలంగా స్పందించినట్లు, ఇరు వర్గాల మధ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం తన కంఫర్ట్ జోన్‌ను దాటి, కొన్ని బోల్డ్ సన్నివేశాల్లో నటించేందుకు కూడా ఆమె సిద్ధపడినట్లు సమాచారం.గత కొంతకాలంగా తమన్నా తన కెరీర్ గ్రాఫ్‌ను పూర్తిగా మార్చే ప్రయత్నంలో ఉన్నారు. 'జైలర్' చిత్రంలో ప్రత్యేక గీతంతో మాస్‌ను ఉర్రూతలూగించిన ఆమె, 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో బోల్డ్ పాత్రలో నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సీనియర్ హీరోయిన్లు క్లాసిక్ పాత్రలకే పరిమితమవుతుంటే, తమన్నా మాత్రం గ్లామర్ మరియు నటనకు ఆస్కారమున్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'రాగిణి MMS 2' చిత్రంలో సన్నీ లియోన్ నటన, 'బేబీ డాల్' పాట సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో తమన్నా అడుగుపెట్టనుండటంతో అంచనాలు భారీగా పెరిగాయి. సన్నీ లియోన్ నెలకొల్పిన బెంచ్‌మార్క్‌ను తమన్నా అందుకుంటుందా? లేక తనదైన శైలిలో ఆమెను మించిపోతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వార్త నిజమైతే, తమన్నా కెరీర్‌లో ఇది ఒక సంచలన చిత్రంగా నిలిచిపోవడం మాత్రం ఖాయం.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215